సనాతన సారథి

మార్చి 2013

"ఆ చిరునవ్వులో అందాల హరివిల్లు సన్నజాజుల వానజల్లు కురియు"

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము *56*
సంచిక *3*

మార్చి *2013*

ప్రచురణ తేదీ
ఫిబ్రవరి *23*

1. **తొలి పలుకు**	సంపాదకీయం	2
2. **శివరాత్రి విశిష్టత**	అవతారవాణి	4
3. **ఆదర్శామృతం**	ఆర్.జె. రత్నాకర్	9
4. **సేవాదళ్‌కి స్వామి సందేశం** (2013 జనవరి సంచిక తరువాయి)	అవతార అనుగ్రహ భాషణం	11
5. **బాబా బాటలో జీవించండి** (విద్యార్థులతో డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్)	ఎమ్.ఎస్. ప్రకాశరావు	16
6. **సర్వాంతర్యామి**	డా॥ కె.వి. కృష్ణకుమారి	19
7. **ఎవరెంత దూరం!**	వై. శ్రీరంగనాథరాజు	22
8. **ఎవరికి ఎంత అవసరమో అంతే!**	పలివెల సుబ్బారాయుడు	23
9. **జ్ఞాపకాల పందిరి** (17వ భాగం)	ప్రొ॥ కె. అనిల్ కుమార్	24
10. **ప్రతిష్ఠాత్మక పుస్తక ప్రదర్శన**	ఎస్.జి. చలం, రాష్ట్ర అధ్యక్షులు	28
11. **మహా మహిమాన్విత ప్రేమావతారి** (22వ భాగం)	బి.వి. రమణరావు	29
12. **భగవంతుడు భావప్రియుడు**	చిన్నకథ	33
13. **ప్రశాంతి సమాచారం**	దివి చతుర్వేది	35

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం

ఎడిటర్ : బి.వి. రమణరావు

అసిస్టెంట్ ఎడిటర్ : వి. శ్రీనివాసులు

టెలిఫోన్: 287375 (సనాతన సారథి Extn. 128) STD: **08555** ISD CODE: **0091-8555**

వార్షిక చందా: భారతదేశంలో: ₹ 60.00 విదేశాలకు: ₹ 550, లేక $ 13, లేక £ 9, లేక € 9

గమనిక: *అడ్రసు కవరుపై గల మీ చందానెంబరు ప్రక్కన చందాగడువు ఎంతవరకు ఉన్నదో సూచించడం జరిగింది. మూడు పువ్వుల గుర్తు (***)ఉన్నట్లయితే మీ చందాను వెంటనే రెన్యువల్ చేయించుకోగలరు.*

అధికారికమైన వెబ్‌సైట్లు: శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం: www.sssbpt.org, సనాతన సారథి: www.sanathanasarathi.org **E-mail:** editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) - 515134 తరఫున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ముద్రాపకుడు, ప్రచురణకర్త : కె.ఎస్. రాజన్

తొలి పలుకు

"నేను సాయిబాబాను" అంటూ తమ పధ్నాలుగవ యేట భగవాన్ తాము శిరిడీ సాయి పునరవతారమని ప్రకటించారు.

"శివశక్తులేకమై సత్యసాయిగా అవతరించారు" అంటూ 1963 గురుపూర్ణిమనాడు తమ అవతార రహస్యాన్ని వెల్లడించారు.

1978 మహాశివరాత్రినాడు ఒక విద్యార్థి పోలరాయిడ్ కేమెరాతో తీసిన ఫొటోలో దత్తాత్రేయునిగా సాక్షాత్కరించి అదే తమ నిజస్వరూపమని వెల్లడించారు.

స + ఆయి (తల్లి), బాబా (తండ్రి) = సాయిబాబా

స + అంబ (తల్లి), శివ (తండ్రి) = సాంబశివ

కాబట్టి, సాంబశివ అన్నా, సాయిబాబా అన్నా రెండూ ఒక్కటే, అని 1983 శివరాత్రినాడు స్పష్టం చేశారు.

ఇంకొక సందర్భంలో, **"ఆ మహావిష్ణువే ఈ మహీ విష్ణువై తన ఆయుధముల్ చేకొనగవచ్చె"** అన్నారు.

2008 దసరా సందేశంలో, **"విష్ణువే సత్యసాయిగా అవతరించాడు"** అని మరోమారు స్పష్టం చేశారు.

ఇంకా, అనేకమంది భక్తులకు - శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, శిరిడీ సాయిగా, గౌతమ బుద్ధునిగా, గాయత్రీ మాతగా, ఏసుక్రీస్తుగా - ఇంకా వారివారి ఇష్టదేవతా రూపాలలో దర్శనమిచ్చిన సంఘటనలు కోకొల్లలు. కనుకనే, స్వామిని సర్వదేవతాస్వరూపునిగా కీర్తిస్తున్నాం, ఆరాధిస్తున్నాం. స్వామి సర్వదేవతాస్వరూపులే కాదు, సర్వ దేవతాతీతస్వరూపులనికూడా పెద్దబొట్టమ్మగారి అనుభవం. తాను స్వయంగా రచించి పెట్టెలో భద్రంగా దాచి ఉంచిన "శ్రీసత్యసాయి వ్రతకల్పము" వ్రాతప్రతిని స్వామికి సమర్పిద్దామని బయటికి తీసేసరికి, అందులో **"సర్వ దేవతాస్వరూప"** అని వ్రాసిన ప్రతి చోట **"సర్వదేవతాతీత స్వరూప"** అని ఎఱ్ఱసిరాతో దిద్దబడి ఉంది!

ఈవిషయాన్నే పునరుద్ఘాటిస్తూ ప్రఖ్యాత సైంటిస్టు డా॥ సూరి భగవంతంగారు ఒక పర్యాయం 'శివం' మందిరం (హైదరాబాదు)లో ఉపన్యసిస్తూ, "Swamy is not just an Avatar, He is the Source of all the Avatars (స్వామి అవతారం మాత్రమే కాదు, ఏ మూలాధారతత్త్వం నుండి అవతారాలన్నీ ఆవిర్భవిస్తాయో ఆ పరతత్త్వమే స్వామి) అన్నారు.

సదాశివునివలె భగవాన్ జటాజూటధారి, విభూతి సుందరులు, లింగోద్భవకరులు, 'అనంత' ప్రజల దాహార్తి బాపిన 'గంగాధరులు', అసంఖ్యాకుల రోగార్తి తీర్చిన 'వైద్యనాథులు', విగతజీవులైన వాల్టర్ కోవన్, కుప్పం రాధాకృష్ణయ్య, బ్రిగేడియర్ బోస్‌వంటి భక్తులను పునర్జీవితులను గావించిన 'మృత్యుంజయులు'. కనుకనే, తొలినుండి స్వామి సన్నిధిలో శివరాత్రి ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. శివరాత్రి ఉత్సవాలలో భగవాన్ బాబావారు లింగోద్భవకరులై దర్శనమివ్వడం భక్తులకు చిరస్మరణీయమైన దివ్యానుభూతి. స్ఫటిక, హేమ, రజత లింగములు... ఒకటో రెండో కాదు... ఏకంగా తొమ్మిది, పదకొండు లింగములు ఉద్భవించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ దివ్య లింగములను భగవాన్ అర్హులైన భక్తులకు అనుగ్రహించేవారు. లింగోద్భవముయొక్క పరమార్థాన్ని, సదాశివతత్త్వాన్ని విశదీకరించే భగవాన్ సందేశం **'శివరాత్రి విశిష్టత'.**

అవతరించుట యనుటలో అర్థమేమి?
జనులపై ప్రీతివాత్సల్యపరతతోడ
వారి స్థాయికి దైవంబు వచ్చు భువికి
జీవప్రజ్ఞతొబాటుగా దైవప్రజ్ఞ

అని అవతార తత్త్వాన్ని విశదీకరించారు, భగవాన్. ఒకవైపున సాక్షాత్తు ఈశ్వరునిగా, తమ దివ్య దేహమును సహితం సాక్షీభూతునిగా వీక్షించే నిరామయుడైన దేహిగా వారు పరిపూర్ణ దివ్యత్వాన్ని వ్యక్తపరుస్తూనే మరోవైపున ఈశ్వరమ్మ ముద్దుబిడ్డగా అనంత ప్రేమసుధలు కురిపించి ఆదర్శ మానవత్వాన్ని ఆవిష్కరించిన అపురూపమైన సన్నివేశాలను ఆర్.జె. రత్నాకర్‌గారు పాఠకులతో పంచుకుంటున్నారు.

సేవాదళ్ సభ్యులు సేవతోపాటు వ్యక్తిగత సాధన కూడా చేయడం అత్యవసరమన్నారు భగవాన్. మనస్సు కోతివలె చంచలమైనదే కాదు, విషయవాసనకు అలవాటు పడిన కుక్కవంటిది కూడా. అటువంటి మనస్సును అదుపులోకి తెచ్చి ప్రశాంతమైన ఆత్మతత్త్వంలో ప్రవేశపెట్టే సాధన ఏమిటి? **"సేవాదళ్ సభ్యులకు భగవాన్ సందేశం"** పఠించి, చరించి, తరించండి.

"దేశ విదేశములేలే నేతలు స్వామి ఎదుట విద్యార్థులే" అన్నమాట అక్షర సత్యం. దేశాధినేతలు, ప్రధాన మంత్రులు, సంస్థానాధీశులు, నాయకులు, పాలకులు ఎందరెందరో స్వామి సన్నిధికి విచ్చేసి వారి ఆశీస్సుల నందుకొన్నారు. వారిలో భారత మాజీ రాష్ట్రపతి "భారతరత్న" డా॥ ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ ఒకరు. జాతి, మత భేదాలకు అతీతమైన, విశ్వజనీనమైన భగవాన్ సందేశంపట్ల ఆకర్షితులై డా॥ కలామ్ రాష్ట్రపతి హోదాలోనే కాకుండా అంతకుపూర్వం కూడా ప్రశాంతి నిలయం, బృందావన్‌లలో స్వామిని దర్శించుకున్నారు. భగవాన్ 81వ జన్మదినోత్సవ సందర్భంగా వారు ఒక చక్కని కవిత వ్రాసి భగవాన్‌కి సమర్పించుకున్నారుకూడా. **"బాబా బాటలో జీవించండి"** అన్న ఎమ్.ఎస్. ప్రకాశరావుగారి రచన, డా॥ కలామ్ విశాఖపట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులతో జరిపిన స్ఫూర్తిదాయకమైన సంభాషణ వివరాలను అందిస్తుంది.

మన దృష్టిని దేహమునుండి దైవమువైపుకు మరల్చి, మనల్ని అమృతస్వరూపులుగా, ఆనందస్వరూపులుగా తీర్చి దిద్దాలన్నదే స్వామి అవతార లక్ష్యం అని ప్రబోధాత్మకంగా వివరించే రచన, **"సర్వాంతర్యామి"**. భగవాన్ తమ శారీరక బాధనుకూడా ఆధ్యాత్మిక బోధగా మలచిన సన్నివేశాన్ని గుర్తు చేసుకుంటూ, స్మరణమాత్రాన అంతరంగంలోనూ, ప్రకృతిలోని అణువణువునా సాక్షాత్కరించే స్వామి మనకు దూరమైపోయారని భావించడం అజ్ఞానమంటున్నారు, రచయిత్రి డా॥ కె.వి. కృష్ణకుమారి.

అంతర్యామి, సర్వాంతర్యామి అయిన స్వామికి ఎవరు దూరం? ఎవరు దగ్గర? "బాహ్య విషయములద్వారా నీవు నా సామీప్యమును పొందలేవు. నీవు నా ప్రక్కనే ఉన్నప్పటికీ చాలా దూరంగానే ఉందువేమో! సత్య ధర్మ శాంతి ప్రేమలను అంటిపెట్టుకొని ఉన్నచో నీవెంత దూరంలో ఉన్ననూ నాకు సమీపంగానుందువు" అన్న భగవాన్ సందేశ స్ఫూర్తిని ప్రతిబింబించే రచన **"ఎవరెంత దూరం!"**

ఆర్తరక్షణకొరకు భగవాన్ అనుసరించే పద్ధతులు అద్భుతంగా, అద్వితీయంగా ఉంటాయి. 'సాయి' పిలిచితే 'ఓయి' పలికే దైవం స్వామి. ఆ పిలుపు గజేంద్రుని పిలుపులా, ద్రౌపది పిలుపులా ఉంటే, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏదోవిధంగా సరియైన సమయానికి తమ సహాయమందజేసి భక్తులను ఆదుకుంటారు, భగవాన్. వారి ఆర్తత్రాణపరాయణత్వానికి అద్దం పట్టే సంఘటన, **"ఎవరికి ఎంత అవసరమో అంతే!"**

గగనాన వెలుగొందు తారకలను గణింపవచ్చు, సృష్టిలోని జీవరాశుల పేర్లు చెప్పవచ్చుకానీ, భగవాన్ లీలలను, మహిమలను వర్ణింప వశము కాదు. భగవాన్ మహిమలు ప్రదర్శనకుకాదు, నిదర్శనముకొరకే! భక్తులపై వారికిగల అవ్యాజ ప్రేమానురాగాలే అద్భుత మహిమలుగా ఆవిష్కృతమై భక్తుల్ని ఆదుకుంటాయి, అనుగ్రహిస్తాయి; ఉద్ధరిస్తాయి, ఉత్తేజితుల్ని చేస్తాయి. ఆ ప్రేమకు అవధుల్లేవు, ఆ మహిమలకుకూడా అంతులేదు. దివ్యప్రేమ ఆవిష్కరించే అనంతమైన మహిమల్లో దేనికదే వినూత్నంగానూ, విలక్షణంగానూ, విస్మయం గొల్పేదిగానూ, అన్నింటికీ మించి భగవానుని నిర్వ్యాజ కారుణ్యాన్ని ప్రతిబింబించేదిగానూ ఉంటుంది. అట్టి పరమాద్భుత సంఘటనలలో కొన్నింటిని మీకందిస్తుంది, **"మహా మహిమాన్విత ప్రేమావతారి"**.

ఈ మాసం **"జ్ఞాపకాల పందిరి"**లో ప్రొ॥ అనిల్ కుమార్‌గారు తాను వివిధ సందర్భాల్లో కలుసుకున్న సుప్రసిద్ధ ఆధ్యాత్మికవేత్తలు భగవాన్ బాబావారిపట్ల తమకు గల ఆరాధనాభావం వ్యక్తం చేసిన వైనం వర్ణిస్తూ "ఎంతటివారైనా బాబావారిని దైవంగానే భావించారన్నది నిర్వివాదాంశం" అంటున్నారు. రాష్ట్ర సాయిసంస్థల అధ్యక్షునిగా తన అనుభవాలను పంచుకుంటున్నారు.

- సం॥

అవతారవాణి:

శివరాత్రి విశిష్టత

మహాశివరాత్రిగురించి మన శాస్త్రాలలో అనేక కథలున్నాయి. దేవదానవులు పాలసముద్రం మథించినప్పుడు హాలాహలం ఉద్భవించింది. దేవతల ప్రార్థనపై లోకరక్షణకోసం శివుడు ఆ హాలాహలాన్ని తానే స్వీకరించాడు. కానీ, దాని వేడికి శివుడే తాళలేకపోయినాడు. అందువల్ల, ఆయనను చల్లబరచటం కోసం ఆయన జటాజూటంలో గంగ ఆపకుండా పోయబడింది. శివాలయాలలో శివునకు అభిషేకం చేయటంలో అర్థం ఇదే! అప్పటికి శివునికి కొంత వేడి మాత్రమే తగ్గింది. మిగిలిన వేడిని తగ్గించటానికి చల్లనైన చంద్రుని ఆయన తలపై ఉంచారు. అప్పుడు మరింత వేడి తగ్గింది. పార్వతి చల్లని గంధమును ఒళ్ళంతా రాసింది. కీళ్ళకు చల్లని పాములను తెచ్చి చుట్టింది. తాను హిమవంతుని పుత్రిక కదా! అనగా, మంచు బిడ్డ. కనుక, తాను పోయి శివుని తొడపై కూర్చున్నది. ఈవిధమైన ప్రయత్నములవలన వేడి చల్లారినది. ఇక, శివుడు దేవతలందరితో తాండవం చేశాడు. ఆ ఆనంద తాండవం చేసిన రోజు ఈ రోజేయని భావిస్తున్నారు. కానీ ఈ సన్నివేశాలన్నీ ఒక్క రోజున జరిగినవి కావు. శివరాత్రి అని పిలవడానికి ఇవి కారణములు కావు.

మనో నాశనమే లక్ష్యం

మనకు మహాశివరాత్రి కాకుండా ప్రతి నెల శివుణ్ణి ఆరాధించటానికి శివరాత్రి ఉంది. అయితే, ఈ రాత్రి ప్రత్యేకత ఏమిటి? రాత్రిపూట చంద్రుడు ఆధిపత్యం వహిస్తాడు. చంద్రునికి 16 కళలున్నాయి. ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క కళ తగ్గి అమావాస్యనాటికి చంద్రుడు కాంతి రహితుడు అవుతున్నాడు. మరల అక్కడినుండి ఒక్కొక్క రోజుకు ఒక్కొక్క కళ పెరిగి పూర్ణిమనాటికి పూర్ణకళలతో విరాజిల్లుతున్నాడు. మనస్సుకు అధిష్ఠాన దైవం చంద్రుడు. “చంద్రమా మనసో జాతః” చంద్రుడు ఆ విరాట్ పురుషుని మనస్సునుండి ఆవిర్భవించాడు. మనస్సుకు, చంద్రునికి చాలా దగ్గర సంబంధం ఉంది. రెండుకూడా వృద్ధి, క్షయములు కలవే! క్షీణించే మనస్సుని అదుపులో ఉంచి, తగ్గించి, చివరకు నాశనం చెయ్యాలి. సాధన అంతా ఆ లక్ష్యం చేరటానికే! **మనోహర అంటే మనస్సును హరింప చేయువాడని** అర్థం. మాయను తొలగించి సత్యం తెలుసుకోవాలి.

కృష్ణ పక్షంలో ప్రతి రోజు క్రమంగా చంద్రుడు క్షీణిస్తాడు. ఆ సమయంలో మానవుని మనస్సుకూడా క్షీణిస్తుంది. చివరకు పదునాల్గవ రోజు చతుర్దశినాడు చంద్రునిలో సన్నని రేఖ మాత్రమే మిగులుతుంది. ఆ రోజున సాధకుడు మరింత అధికంగా సాధన చేసినట్లయితే ఆ కాస్త కూడా తొలగించుకొని మనోనిగ్రహం సాధించ వచ్చు. అందుకనే కృష్ణ పక్షంలోని చతుర్దశిని శివరాత్రి అని అంటారు. ఆ రాత్రి నిద్రాహారములు మాని శివుణ్నిగూర్చి జప, ధ్యానములు చేయాలి. అప్పుడు విజయం సాధ్య మవుతుంది. సంవత్సరమునకు ఒకసారి వచ్చే మహా శివరాత్రినాటి రాత్రి ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మికోత్సవం చేయవలసి ఉంది. అదే మనస్సులోని కల్మషం తొలగించటంద్వారా శవమును శివముగా మార్చటం!

లింగోద్భవము - అంతరార్థము

ఈ మాఘకృష్ణ చతుర్దశికి మహాశివరాత్రి అనే పవిత్రత వచ్చినది ఏ కారణమువలన అనగా, ఆ రాత్రి శివుని దివ్య దేహోపాధినుంచి జ్యోతిర్లింగోద్భవమగును అని పురాణములు ఘోషించుచున్నవి. మాఘ కృష్ణ చతుర్దశి రాత్రి ఉత్తర దిక్కున కైలాసగిరి ప్రాంతమున ఒక



మహాజ్వాలయును, తన్మధ్యమున ఒక సహస్ర సూర్య సమప్రభాన్వితమగు లింగమును ఆవిర్భవించును. దాని ఆద్యంతములను గానలేక బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, ఇద్దరూ ఆదిమధ్యాంతరహితుడగు సదాశివునకు ప్రణమిల్లి నుతించిరి, అనేది ఆస్తికుల నమ్మకము. ఇందువలననే ఆనాటి రాత్రికి లింగోద్భవ కాలమని సర్వదేశ వ్యవహారము కలదు.

కొంతమంది తమలోనే తాము ప్రశ్నలు వేస్తున్నారు, "స్వామీ! లింగోద్భవము చేయటంలోని అర్థమేమి?" అని. "భగవంతుని శక్తి సామర్థ్యములు అగమ్యము, అగోచరము. అందరూ లింగోద్భవమును, లింగమును దర్శించుచున్నారే కానీ వాని తత్త్వము నందుకొనుటకు ప్రయత్నించరు. "లీయతే గమ్యతే ఇతి లింగమ్". దేనిలో ఈ జగత్తు అంతా లీనము అవుతున్నదో, దేనిలో లయము కావలెనని జగత్తు గమించుచున్నదో అదే లింగము. ఆది, అంత్యములు లేని దానికి అదొక గుర్తు. ఆకారరహితుడై, అన్ని ఆకారములూ తానై వెలయు పరమాత్మునికి అదొక గుర్తు. ఇది ముఖము, ఇది తల, ఇవి చేతులు, అని నిర్ణయించటానికి సాధ్యము కానటువంటిది లింగము. పరమాత్ముని సర్వ వ్యాపకత్వమునకు, సర్వజ్ఞత్వమునకు అదొక గుర్తు.

హిమాలయ పర్వతాగ్రములనుండి కన్యాకుమారివరకు నేడు యావద్భారత దేశము, "శివోహం, శివోహం, ఓం నమశ్శివాయ" అను స్తోత్రములతో ప్రతిధ్వనించుచున్నది. ఇచ్చట అనేక వేలమందియు, తదితరచోట్ల లక్షలు కోట్లాది ప్రజలు ప్రార్థనలు సలుపుటవలన నాలోనుండి లింగము లావిర్భవించుచున్నవి. లింగోద్భవమువలన ప్రపంచ మంతయు నా ఆశీర్వాదమును పొందగలుగుచున్నారు.

ఈ లింగోద్భవము నాకు సహజ స్వభావమే.... భక్తుల ప్రార్థనలవలన, శివానుగ్రహమువలన లింగోద్భవము జరుగును. లింగోద్భవ కార్యమును అతని అపార అనుగ్రహమునకొక చిహ్నముగా గుర్తించవలెను. ఓంకారము పరమాత్మునియొక్క నాదచిహ్నమైనటుల, లింగము భగవంతునియొక్క దృగ్గోచరమగు ఆకార చిహ్నము. ఇది మిగుల అర్థవంతమైనది. **లింగమనగా అంతమందు జగత్తు పొందెడు మార్పు.** అనగా సర్వము లీనమగుట, ఆకారములన్నియు నిరాకారములో చేరుట. సర్వ ఆకారములయొక్కయు, దేవతలయొక్కయు, మానవులయొక్కయు, సర్వజీవులయొక్కయు, సమస్త లోకములయొక్కయు ప్రధాన లయకారుడే శివుడు.

అంగము - సంగము - జంగమము - లింగము

శివరాత్రి రోజున మనస్సు లయమవ్వాలి. జగత్తు ఆవిధంగా లింగములో లీనమవవలసిందే. పానవట్టమును చూడండి. మూడు స్థాయిలలో ఉన్న పీఠము ఉంటుంది. ఆ మూడు స్థాయిలు మూడు గుణములన్నమాట. పైనున్న లింగము జీవిత లక్ష్యమును సూచిస్తుంది. లింగము సృష్టికి సంకేతము. త్రిగుణములయొక్క, బ్రహ్మముయొక్క చైతన్యమునకు ఫలితమే సంకేత రూపంగా లింగముగా చెప్పబడింది. ఈ పరమార్థం తెలిసికొని లింగమును పూజించాలి.

అంగములో, అంటే, కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, అంతఃకరణలతో చేరిన ఈ దేహములో సంగమున్నది. దేని సంగము? చిత్తు, జడము – వీటి సంగము; ఆత్మ, అనాత్మ – వీటి సంగము. ఈ సంగమువలననే సత్యాసత్య మిశ్రమమైన మిథ్యా జగత్తు ఉద్భవించినది. జగత్తు జంగమము; ఒకచోట నిలుకడలేనిది. సంసారమని దానికి



పేరు. అదొక ప్రవాహము; భూత, భవిష్యత్ వర్తమానములలో మార్పుచెందును. ఈ జంగమ సంసారములో మునిగి తేలుచూ, మానవుడు తన వివేక విచక్షణ వైరాగ్యాది గుణములను అభివృద్ధిజేసుకొని, పరమాత్ముని లింగ స్వరూపమును, అంటే గుర్తును, అన్ని వైపుల్లోనూ అన్ని శబ్ద స్పర్శ రూప రస గంధములలోనూ అనుభవించి ఆనందించి తరింపవలెను. ఈ జంగమ ప్రపంచములో సంగముల గొడవలో జీవించుచున్న అన్ని జీవుల అంగములను నడిపించుచున్న శక్తి తత్త్వము ఆ లింగమే. ఈ సమత్వ బుద్ధిని అభివృద్ధి చేసుకొని, ఏకత్వాన్ని దర్శించి, దివ్యత్వాన్ని సంపాదించుకొనవలె ననేదే మీకు అందించే శివరాత్రి సందేశము. దీనికి కావలసిన అంతర్దృష్టిని పెంచుకొని, ఆలస్యము దూరము చేసుకొని, విజయమును సాధించండి.

నందివాహనుడు

శాస్త్రములలో ప్రతి మాట, ప్రతి రూపము సాంకేతిక పరిభాషలో చెప్పబడ్డాయి. వాటి పరమార్థములు వేరుగా ఉంటాయి. మనము గుండెను హృదయము అంటాము. హృది, అయం అనే రెండు పదముల కలయిక అది. హృది అంటే గుండెలో, అయం అంటే భగవంతుడు అని అర్థము. హృదయము శరీరావయవములకు రక్తం ప్రవహింపజేసే అవయవమని కాదు. భగవంతుని పీఠం అని అర్థం. అది శివుడు అధిష్ఠించే సింహాసనం, జ్ఞానదీపం వెలిగే ప్రమిద. మానవులు భావించినట్లు శివుడు ఎద్దు మీద ఎక్కి తిరుగుతాడు. ఆ ఎద్దు అనేది ధర్మమునకు సంకేతం. దానికి నాలుగు పాదాలు సత్య ధర్మ శాంతి ప్రేమలు మాత్రమే.

శివుడు త్రినేత్రుడు ఆ మూడు నేత్రములు భూత, భవిష్యత్ వర్తమాన కాలములు. శివునికి అన్నికాలములూ తెలిసి ఉంటాయి. ఆయన ధరించే గజచర్మము పురాతన అనాగరిక కాలంలోని జంతులక్షణం, ఆయన అనుగ్రహంతో తొలగించబడుతుంది. అది శక్తిహీనమయ్యేలా, దానివల్ల హానిలేకుండా ఆయన చేస్తాడు. నిజానికి ఆయన దానిని ఖండఖండములుగా చీల్చివేస్తాడు.

దేవాలయములలో శివునికెదురుగా ఒక నందిని చూచుచుందుము. అందలి భావమేమిటి? ఇప్పటి అర్థము ప్రకారం, అది ఈశ్వరుని వాహనమైన ఒక కోడె అనియు, బసవన్న అనియు తలంతురు. కానీ, ప్రాచీన కాలపు శాస్త్రము వేరు! శివలింగం ఈశ్వర ప్రతీకమనియు, నంది జీవప్రతీకమనియు, జీవేశ్వరులమధ్య భేదం చూడగూడ దనియు; శివలింగానికి, నందికి మధ్య ఎవ్వరూ అడ్డు రాకూడదని ఆలయాచారము. నంది శృంగ మధ్యములో నుంచి శివలింగ దర్శనం చేయడం మహాపుణ్యమనియు ఇప్పటివారు భావింతురు. ఎందుకనగా యథార్థమయిన అర్థమును తెలియనివారగుటచే! కానీ, అంతరార్థము అది కాదు. జీవునిలో శివుని దర్శించుమనియే పరమార్థము.

పశువు పశుపతికి వాహనము. అనగా, ఈశ్వరునికి అంకితమైనపుడు - నంది, ఈశ్వరుడు అను రెండు రూపములు, రెండు భావములుకాక నందీశ్వరుడను ఒకే నామరూపములను స్వీకరించును. అప్పుడు అది ఆరాధనీయమవుతుంది. జీవుడు ఈశ్వరార్పితమై ధన్యత గాంచటమే యథార్థ పరమార్థము.

భజన, పూజలు ఎందుకోసం?

మానవునిలో మూడు విధములైన స్వభావములు కలవు... మొదటిది అనేకాగ్రత, రెండవది ఏకాగ్రత, మూడవది శూన్యావస్థ. ఈనాడు నూటికి తొంభై తొమ్మిదిమంది అనేకాగ్రత లేక శూన్యావస్థలో ఉన్నవారే అని చక్కగా విచారించిన అర్థమగును. అయితే, ఏకాగ్రత నొందుటకు ఈనాడు పవిత్రమైన పర్వదినము. ఇది తగిన సమయము. దానికొరకై ఈనాడు భజన చేయడము, భగవత్సంబంధమైన కార్యక్రమములు సలుపటం భారతీయుల పద్ధతి. అయితే, ఎవరి నిమిత్తం ఈ భజన, ఈ పూజలు? దైవముకోసమా? లేక మనకోసమా? అని నిర్ణయించుకోవటం అవసరము.

అనేకమంది సేవకులు, పనివాళ్ళు అధికారులను, శ్రీమంతులను స్తుతించి వాళ్ళ నుంచి ఏదైనా ఉపకారము, అనుకూలము, సహాయములను పొందుదురు. ఆవిధముగా తమను స్తోత్రము చేసినవారికి, వర్ణించినవారికే సహాయ మొనరించటము, తోడ్పడటము శ్రీమంతులకు సహజమే! కానీ, భగవంతుడు తనను స్తుతించటముచేత, తన గుణగణములను కీర్తించటముచేత, మనకేదయినా ఉపకారము చేస్తాడని భజన చేస్తున్నామా? పూజలు సలుపుచున్నామా? కాదు, కాదు. పరమాత్ముడు సకలైశ్వర్య సంపన్నుడు. మన స్తోత్రమునకు, కీర్తించటమునకు ఆయన లొంగుతాడా?! ఆ పరమేశ్వరుని గుణ గణములను స్మరించుటవలన, స్తుతించుటవలన, అవి మన హృదయములను సంస్కరించును అనే విశ్వాసముతో పూజ చేస్తున్నాము. ఎట్టి తలంపులను తలంతుమో అట్టి తలంపులు మన హృదయమందు ముద్రింపబడును. నిరంతరమూ ఇతరుల చెడ్డ గుణములనే చింతించిన, మన హృదయముకూడ దోషభూయిష్ఠమై మాలిన్యమగును. మంచి గుణములు, ఉత్తమ భావములు ప్రవేశించుటకు అవకాశముండదు. మునిసిపల్ దిబ్బను తీసుకొనిపోయే లారీ ఇంటి ముందర నిలిస్తే మన ముక్కులకుకూడా దుర్వాసన తగులును. ఏ చిన్న వస్తువుగానీ, ఏ అల్ప విషయముకానీ, స్మరించిన చాలును; దాని ప్రతిఫలము మనస్సులో ముద్రింపబడకపోదు. ఈ తత్త్వమును పురస్కరించుకొనియే వేదశాస్త్ర ఉపనిషత్తులు, "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అని బోధించినవి. దివ్య భావాలనే స్వాగతించండి అని హెచ్చరించినవి.

నోటియందు ఉప్పువేసుకొని, మధుర జలము త్రాగితే, దాని రుచి తెలియునా?! కలకండను (పటిక బెల్లం) నాలుక క్రింద పెట్టుకొని పకోడాలు తింటే అవి కూడా తీయగా ఉండును. మనయందు మంచి భావాలు అభివృద్ధి చేసుకున్న తర్వాత మనము అందుకొనే అన్నియును మంచిగానే తోచును. దుర్భావములను అభివృద్ధి చేసుకొనిన, అన్నియును దుర్భావములలోనే చేరిపోవును. కాబట్టి, మనము స్మరించేవన్నీ మంచి విషయములుగానే ఉండిన మన స్వరూప స్వభావములుకూడా దివ్యముగా, పవిత్రముగా మారును. ఇదే శివరాత్రియొక్క సందేశము.

మహాశివరాత్రినాటి పరమార్థము ఇదే! అంతేకాని, ఆరోజు రాత్రి కేవలం జాగరణ ఉండటమే ముఖ్యమని భావిస్తే అది తెలివితక్కువతనం! పైగా ఆరోగ్యానికి హానికూడా! ఆ రాత్రి నిద్రపోకుండా కొందరు పేకాట ఆడటం, వరుసగా సినిమాలకి వెళ్ళటం చేస్తున్నారు. శివరాత్రినాడు చేయవలసిన సాధన అదికాదు. వాటివల్ల అశ్లీలమును, క్రూరత్వమును, కపటత్వమును పెంపొందించుకొనటమే అవుతుంది. జాగరణ అంటే, విషయవాసన అనే నిద్రనుంచి మేలుకొని, సదా జాగరూకులుగా జీవితమును గడుపుట అని అర్థము. ఒక రాత్రి ఏదో ఒకరీతిగా నిద్రనుంచి తప్పించుకొనుటకాదు. భగవత్ ధ్యానములో గడిపిన దినము నిజముగా శివరాత్రి పండుగయగును. నిరంతర సుఖము నిజముగా దానివల్లనే దొరకును.

(1970వ దశకంలో భగవాన్ అనుగ్రహించిన శివరాత్రి దివ్యోపన్యాసములనుండి)

ఆదర్శామృతం

ఆర్.జె. రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే

"శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే
ఇతరులు అనుసరింతురు. అతని ప్రవర్తననే
అనుకరింతురు. అతడు నిల్పిన ప్రమాణములనే
లోకులందరూ పాటించెదరు."

(భగవద్గీత అధ్యా. 3 శ్లో. 21)

మహనీయులు, సద్గుణవంతులు సదాచారపరులై ధర్మమును పాటింతురు. వారియొక్క నడవడిక, వారు అనుసరించే విధివిధానములు అందరికీ ఆదర్శ ప్రాయముగా నుండును. అందుచేత వారు సంఘములో పూజింపబడుదురు, గౌరవింపబడుదురు. వారి ప్రభావము వారు జీవించుచున్నటువంటి పరిసరములకే పరిమితము కాక, సర్వత్రా వ్యాప్తి చెందును. అందువలన మహనీయులను ప్రజలు అనుసరించుట పరిపాటి.

మను ధర్మశాస్త్రము మొదలుకొని బుద్ధుని దమ్మపదం వరకు మనుజులు ఏవిధంగా ధార్మిక జీవితం గడపాలనేది చెప్పబడింది. ధర్మమును ప్రతి ఒక్కరూ పాటించవలెననే ప్రబోధ మన భారతీయ సంస్కృతి మనకు నేర్పింది. మానవుడు నాగరికత నేర్చినప్పటినుండి జరిగిన పరిణామములు, వేద పురాణేతిహాసములు మరియు అనేక గ్రంథరాజములన్నియుకూడా మానవుని నడవడికను తీర్చిదిద్దేవిగానే రూపొందాయి. వాటినుంచే సంప్రదాయములు, కట్టుబాట్లు అనేవి పుట్టుకొచ్చాయి. వర్ణాశ్రమ ధర్మములు ఆచరణలోకి వచ్చాయి. ఏవి అనుసరణీయమో తెలుపుతూ, అనుసరణకు నిషిద్ధమైన విషయములు కూడా విశదీకరించడం జరిగింది. వీటన్నిటి కలబోతే మన భారతీయ సంస్కృతి. స్వామివారు చెప్పినట్లు సంస్కృతి (culture) అంటే జీవన విధానమే (way of life).

కానీ ప్రస్తుతం మనము ఈ సంప్రదాయములను, కట్టుబాట్లను పాటించడంలేదు. మన సంస్కృతిని పట్టించుకోవడంలేదు. అందుకే ఎక్కడ చూసినా అలజడి, అశాంతి తాండవం చేస్తున్నాయి.

ప్రేమరతనాలు - 15

కలియుగంలో మనందరినీ సన్మార్గములో నడిపించడానికే భగవాన్ అవతరించి ప్రేమ, సేవ మార్గములను మనకు నేర్పించారు. వారు ఆచరించి నేర్పినదే మనమందరం అనుసరిస్తున్నాము. అందులకే ఈరోజు ప్రశాంతి నిలయం కోటానుకోట్ల భక్తులకు శాంతిప్రదాయిగా మారింది. మన జీవితాలుకూడా ప్రశాంతిమయంగా మారాయి.

"నా జీవితమే నా సందేశము" అన్నారు భగవాన్. వారి జీవితాన్ని మనకు సందేశంగా ప్రసాదించి భక్తులందరినీ దైవోన్ముఖులను గావించిన కరుణామూర్తి భగవాన్. వారు పలికిన ప్రతి మాట, వారు చేపట్టిన ప్రతి పని లోకహితం కోసమే! భక్తుల ఆనందంకోసమే!

ఏ అవతారమూర్తి చేయనటువంటి విధంగా భక్తులతో మమేకమై, వారియొక్క సుఖదుఃఖాలలో తోడుగా నిలచి, ప్రేమతో భక్తులను దివ్యత్వమువైపు అడుగులు వేయించిన జగద్గురువు భగవాన్! వారు చూపించిన ఆదర్శాలు హృదయానికి హత్తుకుపోయేవిధంగా ఉంటాయి.

వారి దివ్య సాంగత్యంలో నేను చూచి తరించిన అనుభవాలు మీకోసం...

2003వ సంవత్సరం, జూన్ నెల, 4వ తేదీ అనుకుంటాను. నేను బెంగళూరులో ఉన్నాను. భగవాన్ వైట్‌ఫీల్డులోని తమ బృందావనం ఆశ్రమంలో ఉన్నారు. సూర్యోదయమైనా ఆలస్యం కావచ్చేమోకాని, ఉదయం పూట స్వామివారి దర్శనం ఎప్పుడూ ఆలస్యమయ్యేది కాదు. మన వాచీలో సమయాన్ని సరిచేసుకొనేంత ఖచ్చితంగా ఉండేది వారి ఆగమనము.

ఆరోజు భగవాన్ దర్శనమిచ్చేందుకు రాలేదు. ఈ వార్త భక్తులకెవ్వరికీ ఇసుమంతైనా మింగుడు పడనిది. తక్షణమే ఫోన్లు రావడం ప్రారంభించాయి.

మొదలు నేను గాబరా పడలేదు. కానీ, పుట్టపర్తిలోని మా ఇంటినుంచి నాన్నగారు ఫోను చేసి, "స్వామి దర్శనానికి దిగలేదట. మేము బయలుదేరి వస్తున్నాము" అని చెప్పి ఫోను పెట్టేశారు,

ఉన్నట్లుండి గుండె దడ పెరిగింది. క్షణము ఆలస్యం చేయకుండా బయలుదేరి బృందావనం ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ అందరుకూడా తెల్లబోయిన మొహాలతో తెలియని ఆవేదనతో అగుపించారు.

నెమ్మదిగా ఏం జరిగిందని విచారించాను. ఆరోజు ఉదయం స్వామివారు అలవాటుగా తీసికొనే గంజికూడా తీసికొనలేదని, అసలు తలుపులే తీయలేదని తెలిసింది.

సమయం 10.30 గంటలైంది. మనస్సులో భరించలేని లక్ష ఆలోచనల రొద, బయట కర్ణభేరి పగిలిపోయేంతటి నిశ్శబ్దం! భూమి పరిభ్రమించటం ఆగిపోయిందా అన్నట్లు సమయం ముందుకు సాగడం లేదు. గుండెలు బరువెక్కుతున్నాయి. క్షణమొక యుగంలా అగుపడుతోంది.

12 గంటలైంది... ఎప్పుడు వస్తారా అని ఆత్రుతతో నిండిన కళ్ళన్నీ స్వామి గదివైపు గురిపెట్టి ఉన్నాయి.

సమయం దాదాపు 3 గంటలై ఉంటుంది. సహింప శక్యము కాలేదు. ఏమి జరిగిందో తెలియదు. స్వామికి ఏమైనా అవసరమేమో అన్న ఆదుర్దా. ఇంక ఉపేక్షించడం



తప్పిదమవుతుందేమో అని ధైర్యం చేశాను. 'స్వామి గది తలుపు తట్టి ఏం జరిగిందో తెలుసుకుందాము. మనం ప్రాణప్రదంగా ప్రేమించే భగవాన్‌తో కాస్త చొరవ తీసుకుంటే తప్పేంటి' అనిపించింది.

వెళ్ళి స్వామివారి గది తలుపు తట్టాము. కొన్ని నిమిషాలు ఎటువంటి ప్రతిస్పందనా లేదు. తలుపు తట్టడం ఆపలేదు.

స్వామివారి ఆజ్ఞ అయిందేమో, నెమ్మదిగా తలుపులు తెరుచుకున్నాయి. గదిలోకి వెళ్ళాము. మంచముమీద కూర్చుని ఉన్న భగవాన్‌ని చూసి ప్రాణాలు లేచి వచ్చాయి. "ఏమైంది స్వామీ? ఎందుకు ఇలా ఉన్నారు?" ఆత్రుతతో అడిగాము.

అప్పుడు స్వామివారు, **"నేను బాగానే ఉన్నాను. ఏమీ కాలేదు"** అని చిరునవ్వుతో సమాధానం చెప్పి నెమ్మదిగా మాట్లాడసాగారు.

నిల్చుని ఉన్న మా తండ్రిగారిని చూసి కుర్చీ తెప్పించి, **"కూర్చో రామయ్యా"** అన్నారు ఆప్యాయంగా.

అంతా బాగానే ఉన్నట్లుంది. కొంతసేపు ముచ్చటించాక, అందరం పాదనమస్కారం చేసికొని, సెలవు తీసుకొని బయటకు వచ్చాం. బయట కాచుకున్న భక్తులందరుకూడా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, నా మనసులో ఏదో తెలియని ఆందోళన మిగిలే ఉంది.

సాయంత్రం 7 గంటల సమయంలో ఎక్స్‌రే చూడగానే నా ఒంట్లో రక్తం గడ్డకట్టినట్లయింది. నిర్ఘాంతపోయాను. స్వామివారి తుంటి ఎముక మూడు ముక్కలైన ఆ దృశ్యం మాటలలో చెప్పలేని దుఃఖాన్ని ఎదలో నింపేసింది.

మరి మాతో కూర్చుని నవ్వుతూ మాట్లాడిన స్వామి ఎవరు? ఇంత గాయం అయినాకూడా ఎవరైనా కూర్చొనగలరా?! ఎందుకు వారికి తమ దేహముపై ఇంతటి ఎఱుకలేమి?! **'నేను దేహము కాదు, దేహిని'** అని చెప్పినా, ఇలా చేసి చూపించాలా?! ఇప్పటికీ గగుర్పాటు గొల్పే ఆ సంఘటన నా మనోంతరాళాలలో మాయని గాయాన్నే మిగిల్చింది.

తదుపరి జరిగిన విషయాలు స్వామివారే తమ ఉపన్యాసాల్లో చెప్పి ఉన్నారు.

సెప్టెంబరు 24వ తేదీ సాయంత్రం భజనానంతరం నాన్నగారు, నేను కలిసి స్వామివారి నివాస మందిరానికి వెళ్ళాం. అక్కడ ద్వారంవద్ద డ్యూటీలో ఉన్న సేవాదళ్, "ఈ రోజు ఎవ్వరినీ మందిరంలోకి అనుమతించవద్దు. ఒక్క జానకిరామయ్య వస్తే మాత్రం లోనికి అనుమతించు" అన్న స్వామివారి ఆజ్ఞను మాకు చెప్పాడు. స్వామివారి ఆజ్ఞ ప్రకారం నాన్నగారు మందిరంలోకి వెళ్ళారు. నేను ఇంటికి వెళ్ళిపోయాను.

ఆరోజు స్వామివారితో మా తండ్రిగారు ఒక్కరే ఉన్నారు. దాదాపు ఒక గంటకుపైగా స్వామివారితో గడిపి, వారి భోజనానంతరం ఇంటికి తిరిగి వచ్చారు.

ఈవిషయం ఇంత విపులంగా వ్రాయడానికి కారణం ప్రశాంతి నిలయంలో అదే వారి చివరి కలయిక. ఒక జీవిత పర్యంతం తోడు తెచ్చుకున్న తమ్మునికి సర్వమెరిగిన సాయిదేవుడు చివరిసారిగా ప్రసాదించిన ఏకాంతం అనుకుంటాను. ఏం మాట్లాడుకున్నారో తెలియదు.

మరుసటి రోజు తెల్లవారుఝామున నాలుగు గంటల ప్రాంతంలో నాన్నగారికి గుండె నొప్పి వస్తే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఆయన తిరిగి రాలేదు.

అక్టోబరు 17వ తేదీన మా తండ్రిగారు కాలం చేశారు. దానికి ముందురోజు నాన్నగారిని చూడటానికి భగవాన్ ఆసుపత్రికి వచ్చారు. గదిలోనికి ప్రవేశించిన స్వామివారు వచ్చి మా నాన్నగారి మంచం ప్రక్కన నిల్చున్నారు. వారి ప్రక్కనే నేనున్నాను. 74 సంవత్సరములు తమ వెంట నడిచిన తమ్ముడు ఆసుపత్రి పడకమీద అచేతనంగా ఉండటం చూసి, ఆ అమనస్కుని మదిలో మెదిలిన భావాలను మనం ఊహించడానికి సాధ్యం కాదు.

ఉన్నట్లుండి స్వామివారు, **"రామయ్యా, నేను వచ్చాను. ఒక్కసారి కళ్ళు తెరిచి నన్ను చూడు"** అన్నారు. తన శరీరంలో ఉన్న ప్రాణశక్తినంతా ఉపయోగించి కళ్లు తెరిచి స్వామివారిని చూడాలని ప్రయత్నించారు, మా నాన్నగారు. కొద్ది క్షణాలు మాత్రమే కళ్ళు తెరవగలిగారు. కానీ, స్వామివారు పిలవటం ఆపలేదు. **"రామయ్యా, ఒక్కసారి నన్ను చూడు, రామయ్యా, కళ్లు తెరువమ్మా"** అని దాదాపు ఇరవై నిమిషాలు పిలుస్తూనే ఉన్నారు. ఆ దృశ్యం చూసి కన్నీటి పర్యంతం కానివారెవరుంటారు! ప్రక్కనే నిల్చుని ఉన్న నా గుండె శూన్యంతో నిండిపోయింది. గంభీర నిశ్శబ్దం ఆవరించిన ఆ గది స్వామివారి గొంతుకతో ప్రతిధ్వనించింది. స్వామివారి ఆజ్ఞ పాటించలేకపోతున్నందుకు మన్నించమన్నట్లున్నాయి మా తండ్రిగారి హావభావాలు. లక్ష్మణస్వామి మూర్ఛపోతే దిక్కుతోచక సహాయంకోసం అందరినీ అభ్యర్థన పూర్వకంగా చూస్తున్న శ్రీరామచంద్రుడా అన్నట్లున్నాయి స్వామివారి ముఖ కవళికలు.

స్వామివారి ప్రేమకు అవధుల్లేవు. ప్రేమను ఎంతగా పంచవచ్చో, ఎంతగా కురిపించవచ్చో నేర్పడానికే ఇటువంటి ఆదర్శాలు ఎన్నో స్వామివారు మనకు చూపించారు.

ఒకప్రక్క దేహభ్రాంతి లేని దైవస్థితి! మరోప్రక్క ప్రేమ, వాత్సల్యములతో నిండిన మానవ నీతి!

ఇంతటి గొప్ప పాఠాలను నేర్పించినటువంటి ఆ స్వామివారి ప్రేమఋణాన్ని ఎన్ని జన్మలెత్తి తీర్చుకోగలం! స్వామివారి ప్రబోధలే మన జీవిత పరమావధిగా మారి మనమందరం ఆదర్శ జీవితాలను గడపాలని, స్వామి అనుగ్రహం ఎల్లవేళలా మనపై ఉండాలని ప్రార్థిస్తూ...

"సమస్త లోకాః సుఖినో భవంతు" ❋

అవతార అనుగ్రహ భాషణం:

సేవాదళ్‌కి స్వామి సందేశం

(2013 జనవరి సంచిక తరువాయి)



మీరు వేరుగా భావించకూడదు – రెండువందలమంది సేవాకార్యకర్తలు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు – ప్రతి దినము జపధ్యానములు చేసేవారు ఇందులో ఎంతమంది ఉన్నారో చెప్పండి. ఏ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంటు అయినా, ఏ స్టేట్ ప్రెసిడెంటు అయినా, ఏ కన్వీనరైనా చేస్తున్నారా మీరు గట్టిగా చెప్పండి. ఎవరూ లేరు. ఇలాంటి సమయమునందు సేవాదళ్ సభ్యులకు చెప్పే అధికారము మనకు ఎక్కడ ఉంది?! మనకు సభ్యత్వము అందించినారు కదాయని ఏదో ఒకటి చెప్పాలని ఉత్సాహంతో మనము చెబుతున్నామే గాని హృదయపూర్వకంగా ఆచరించి చెబుతున్నామా?! నీకు నీవే సాక్షిగా ఉండాలి.

సేవతోపాటు సాధన అవసరం

ఒకరు చెప్పినా, చెప్పకపోయినా మన సేవాదళము యందు సేవతోబాటు సాధనకూడను అత్యవసరము. ఎందుకంటె వ్యక్తిగతమైన సాధన నెగెటివ్‌వంటిది. సమష్టి స్వరూపమైన సేవ పాజిటివ్‌వంటిది. ఈ పాజిటివ్‌తో ఆ నెగెటివ్ కలసినప్పుడు కొంతవరకు లోకసంబంధమైన విజయాలను సాధించటానికి అవకాశము ఉంటుంది.

చూడండి, అక్కడినుండి ఎలక్ట్రిక్ వైరు వచ్చింది. అక్కడకూడను కరెంటు ఉందికానీ, లైటు వెలగటం లేదు. ఎక్కడ మనము బల్బు తగిలించామో అక్కడ మాత్రమే లైటు కనిపిస్తున్నది. మన హృదయాన్ని ఒక పవర్‌ఫుల్ బల్బు మాదిరి అభివృద్ధి చేసుకోవాలి. ఎలక్ట్రిక్ వైరుకు పైన ప్లాస్టిక్ కవరు, లోపల కాపరు వైరు ఉంటున్నది. ప్లాస్టిక్ వైరును ప్లాస్టిక్ వైరుతో కలిపితే కరెంటు ప్రవహించటం లేదు. పైనున్న ప్లాస్టిక్ కవరును కట్ చేసి లోపలున్న కాపరు వైర్లు కలిపితే కరెంటు ప్రవహిస్తుంది. అట్లే, దివ్యత్వమనే కరెంటు ప్రతి వ్యక్తియందు ఉంటున్నది.

మన దేహము ఒక ప్లాస్టిక్ వైరు. ప్లాస్టిక్ వైరు, ప్లాస్టిక్ వైరు చేరితే వచ్చిన ఫలితమేమీ లేదు. ఈ ప్లాస్టిక్ వైరులోనున్న మనస్సు అనేది కాపరు వైరు. మనస్సు కనెక్ట్ చేసినప్పుడు దివ్యత్వమనే కరెంటు ప్రసరిస్తుంది. కనుక, మనము ఇతరులకు ఏవిధంగా సేవ చేయాలంటే, దేహముతో సేవచేస్తూ మానసిక సంబంధమైన ప్రీతితో వారిని చేరటానికి ప్రయత్నించాలి. మనము ఈనాడు ప్లాస్టిక్ వైరువంటి దేహంతో ధ్యానంలో కూర్చుంటున్నాము. దేహం మాత్రమే కూర్చున్న లాభము లేదు. మనస్సును

దానికి కనెక్షన్ చేయాలి. ఈ మనస్సునకు కొన్నివిధములైన తర్ఫీదులు ఇస్తూ రావాలి.

మనస్సనేది ఒక కుక్కవంటిది

దీనికొక చిన్న కథ: ఒక శ్రీమంతుడైన గృహస్తునికి దయాప్రేమలు మెండు. ఒకనాడు తాను భుజించే సమయంలో ఒక కుక్క ఆకలితో ఇంటిదగ్గరకు వచ్చింది. ఆకలితో బాధపడే శునకమును చూచి లోపలకు వెళ్లి కొంత అన్నము తెచ్చి వేశాడు. సరి, ఆనాడు దాని ఆకలి తీరిపోయింది. రెండవ దినము తిరిగి ఆ కుక్క ఆ యింటికే వచ్చింది. ప్రతి దినమూ ఈ కుక్క రావటము, యజమాని అన్నం పెట్టటము... ఈవిధంగా రెండు, మూడు సంవత్సరములు జరిగింది. ఒకనాడు ఇతనికి విసుగు పుట్టింది. దీనిని ఏరీతిగా తరుమగొట్టటం? ఎంత కొట్టినా అది పోవటం లేదు. అది రాకుండా ఉండాలంటే ఏమి చేయాలి? ఏ ప్రాక్టీసు యిచ్చి ఆ కుక్కను తన ఇంటికి రప్పించుకున్నాడో ఆ ప్రాక్టీసులోనే కొంత మార్పుచేస్తే అది రాకుండాపోతుంది. తాను కొన్ని సంవత్సరములు అన్నం పెట్టటంవలన ఆ కుక్క తనదగ్గరకు వస్తున్నది. కొన్ని దినములు అన్నం పెట్టకుండాపోతే ఆ కుక్క చూచి చూచి వెళ్లిపోతుంది.

అదేవిధముగా, అనేక జన్మలనుండి మనస్సనే కుక్క విషయ సంబంధమైన ఆకలితో మనయొక్క ఆత్మ అనే యజమాని ఇంటిలో ప్రవేశిస్తున్నది. ఆ మనస్సనే కుక్కకు విషయవాసనలు అందిస్తూ అందిస్తూ చక్కగా అలవాటు చేసుకొన్నాము. కనుక, అది మనలను వదలిపోలేకుండా ఉన్నది.

మనస్సుకు వాచ్‌మెన్ పని పెట్టాలి

నీవు సామాన్యంగా బజార్లో తిరిగే సమయములో గాని, వేరే పనులు చేసుకొనేటప్పుడుగాని మనస్సు కొంతవరకు 'క్వైట్'గా ఉంటుంది. కాని, ధ్యానములో కూర్చునేటప్పటికి దీనికి ఎక్కడలేని పనంతా చిక్కుతుంది! అనవసరంగా అన్నివైపులా పరుగెడుతుంది. కనుక, అట్టి ధ్యానముకంటె సామాన్యమైన పనులు చేసుకోవడం ఉత్తమమైన ధ్యానంగా భావించవచ్చు. ఐతే, ఇంతమాత్రంచేత నీవు నిరుత్సాహ పడనక్కరలేదు. ఈవిధంగా విషయవాసనలు అందించి, అందించి, మనస్సుయొక్క చంచలత్వానికి దోహదం చేసే బదులుగా కొంతకాలం మనస్సుకు విషయవాసనలు అందించకుండా దానిని ప్రశాంతమైన ఆత్మతత్త్వములో ప్రవేశింపజేయటానికి కొన్ని సాధనలు చేయాలి.

ఇది ఏరీతిగా చేయాలి? మనస్సునకు తీరికలేని పని అందించినప్పుడు దాని బాధ మనకు యేమాత్రమూ ఉండదు. కోతులు ఆడించేవానిని మీరు చూచి ఉంటారు. చంచలత్వము కోతి స్వభావము. ఊరకే కూర్చోబెట్టుకుంటే, అది కోతిచేష్టలంతా చేస్తూ కూర్చుంటుంది. అందువల్ల ఒక్కొక్క ఇంటికి తీసుకుపోయి, నేలపై ఒక కఱ్ఱ పాతి, "ఎక్కరా తిమ్మన్నా, దిగరా తిమ్మన్నా" అని దానికి పని పెడతాడు. ఎప్పుడూ ఎక్కటం, దిగటం... ఎక్కటం, దిగటం...ఈవిధంగా కోతికి ఒక పని పెట్టినట్లవుతుంది, దానిని ఆడించేవానికి భిక్షముకూడ లభిస్తుంది.

అదేవిధముగా, ఈ మైండ్ ఒక 'మ్యాడ్ మంకీ' (పిచ్చికోతి). ఈ కోతికి తీవ్రమైన పని కల్పించాలి. అది చేయకుండా మనము ధ్యానమునకు కూర్చుంటే ధ్యానము కుదరదు. కనుక, మొట్టమొదట మైండ్‌కి పనిపెట్టాలి. ఎవరు మనలోపలకు పోతున్నారు, ఎవరు బయటకు వస్తున్నారు అనేది 'వాచ్' చేయమని చెప్పాలి. 'సో' లోపలికి పోతున్నాడు. 'హం' బయటకు వస్తున్నాడు. ఈవిధంగా 'వాచ్‌మెన్' పని పెట్టేటప్పటికి మనస్సు దానిని వాచ్ చేస్తూ ఐదు నిమిషాలలో స్వాధీనానికి వస్తుంది.

జ్యోతి ధ్యానము చాలా ఉత్తమమైనది

నీకు ప్రీతికరమైన దేవతామూర్తి చిత్రాన్ని ముందు పెట్టుకో. లేక, ఒక జ్యోతిని ఎదురుగా పెట్టుకో. ఆ జ్యోతిని కన్నులు తెరచి చక్కగా చూడు. ఏ జ్యోతిని బహిర్ముఖంగా చూసినావో కన్నులు మూసుకొని క్రమక్రమేణా అది నీలో వచ్చినట్లుగా ఊహించు.

అక్కడకూడను మనస్సుకు తీవ్రమైన పని పెట్టాలి. "ఓ మనసా! ఆ జ్యోతిని నా హృదయంలోకి తీసుకొనిరా" అని మనస్సుతో ఆ జ్యోతిని హృదయంలోకి తీసుకొని పోవాలి. హృదయ కమలంలో జ్యోతి వెలుగుతున్నట్లుగా చింతించాలి. అక్కడినుండి ఆ జ్యోతిని దేహములోనున్న సర్వాంగములలోకి ప్రయాణం చేయించాలి. చేతిలోకి,

కడుపులోకి, కాళ్లలోకి, కన్నులలోకి, నోటిలోకి ఈ జ్యోతిని ప్రయాణం చేయిస్తూ రావాలి. నీ దేహమంతా సంచారం చేసిన తరువాత ఆ జ్యోతిని తిరిగి బయటకు తెప్పించాలి. ఆ జ్యోతియే నీ కుటుంబంలో సర్వులయందు ఉన్నట్లుగా భావించాలి. అక్కడినుండి నీ ప్రక్కింటివారు, బజార్లోవారు, నీ మిత్రులు ... అందరియందు ఆ జ్యోతియే ఉన్నట్లు భావించాలి. అంతేకాదు, తదుపరి నీ శత్రువులందుకూడా ఈ జ్యోతియే ఉంటున్నదని నీవు భావించాలి. అప్పుడు 'ఈశావాస్యమిదం సర్వం' అనేది అనుభవానికి వస్తుంది.

జ్యోతి నీ కన్నులలో చేరినది కనుక నీకు చెడ్డదృష్టి ఉండకూడదు. "తమసోమా జ్యోతిర్గమయ", ఎక్కడ జ్యోతి ఉంటుందో అక్కడ చీకటి ఉండదు. కాబట్టి, నీవు చెడ్డదృష్టికి ఏమాత్రం అవకాశమునందించవు. నీ చెవులలో ఈ జ్యోతి చేరటంచేత చెడ్డ విషయాలు వినటానికి వీలులేదు. ఆ జ్యోతియే నీ నాలుకపైన రావటంచేత చెడ్డ మాటలు మాట్లాడటానికి అవకాశము ఉండదు. నీ పాదములలో ఈ జ్యోతి చేరటంవలన చెడ్డప్రదేశానికి ప్రయాణం చేయటానికి యేమాత్రం అంగీకరించవు. నీ చేతులలో ఆ జ్యోతి చేరటంచేత చెడ్డపని చేయటానికి ముందంజ వేయవు.

ఏక జ్యోతిని ఈవిధముగా ప్రయాణం చేయించి, సర్వత్రా ఉన్న పరమాత్మ జ్యోతి, పరబ్రహ్మ జ్యోతి ఒక్కటే అనే సత్యాన్ని మనము గుర్తించుకోవటంలో ఈ ధ్యానమనేది మనకు ఎంతైనా సహాయకారిగా ఉంటుంది.

జీవనజ్యోతి, పరబ్రహ్మ జ్యోతి రెండూ ఒక్కటే!

దీపావళి పండుగ రోజు మీరు గమనించి ఉంటారు. ఒక క్యాండిల్‌తో అనేక క్యాండిల్స్‌ని వెలిగిస్తున్నాము. ఒక్క జ్యోతినుండి అనేక జ్యోతులను మనం అంటిస్తున్నాము. అంటించిన జ్యోతి పరబ్రహ్మ జ్యోతి, అంటింపబడిన జ్యోతులు జీవన జ్యోతులు. అంటించిన జ్యోతి, అంటింప బడిన జ్యోతి రెండుకూడను ఒక్కటిగానే కనిపిస్తుంటాయి. అనగా, పరబ్రహ్మ జ్యోతి, జీవన జ్యోతి రెండూ ఒకటే! "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి." బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకొన్న వాడు బ్రహ్మగానే రూపొందుతాడు. కనుక, జ్యోతి మెడిటేషన్ చాలా ఉత్తమమైనది. కారణమేమనగా, దేహమే ఉన్నదనుకో.... ఈ దేహము క్రమక్రమేణా మార్పు చెందుతూ ఉంటుంది. జ్యోతి మార్పుచెందటానికి యేమాత్రము అవకాశము లేదు.

దీనికి చిన్న ఉదాహరణము. ఒక చిన్న తొట్టెలో నీరు పోసి పెట్టాము. ఒక్కొక్కరు ఒక్కొక్క టంబ్లరు నీరు తీసుకొనిపోతే అందులో నీరు తగ్గిపోతుంది. ఒక ప్రదేశములో ఒక లారీ ఇసుక తెచ్చి పోశాము. ఒక్కొక్కరు ఒక బుట్టెడు ఇసుకను తీసుకుపోతే ఆ ఇసుకకూడను తగ్గిపోతుంది. కాని, ఒక జ్యోతినుండి లక్ష జ్యోతులు అంటించుకొనిపోయినా ఈ జ్యోతి తగ్గిపోదు. జ్యోతికి "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" అనేది వర్తించదు. కనుక, జ్యోతిని నీవు మెడిటేషన్‌లో ఉంచుకొని, తదుపరి నీకు ఏదైనా దేవతారూపము యిష్టముంటే, ఆ జ్యోతిలోపలనే ఆ ఆరాధ్య రూపాన్ని నిలబెట్టుకో. "నా ఆరాధ్య దైవము ఈ జ్యోతిలోనే ఉన్నాడు, పరబ్రహ్మజ్యోతినుండే అన్ని జ్యోతులు వచ్చినాయి" అనే ఏకత్వ భావాన్ని అభివృద్ధిపరచుకోవటం చాలా సార్థకమైన మెడిటేషన్.

దేహ స్పృహ పోవాలి, ఆత్మ స్పృహ రావాలి

ఈనాడు అనేకరకములైన మెడిటేషన్లు విరివిగా పెరిగిపోతూవచ్చినాయి. చెబుతున్నారుగాని దానిని అనుభవించినవారు ఎక్కడా కనిపించటం లేదు. ఇవన్నీ కేవలము ఆర్టిఫిషియల్ మెడిటేషన్స్ అనే చెప్పవచ్చు. కూర్చున్న తక్షణమే, సులభంగా ఒక్కతూరి పైకి పోతాడు! ఎక్కడికి పోతాడో ఎవరికీ అర్థము కాదు!

ఈనాటివారు ఇంత సులభమైన రీతిలోనే సాక్షాత్కారం పొందుతుంటే, ఆనాటి మహనీయులు, ఋషులకు ఈ సులభమైన మార్గం తెలియకుండాపోయిందా! ఇంత సులభంగా వీరు ఆధ్యాత్మిక తత్త్వంలో ప్రవేశించా మనుకుంటున్నారు. కొన్ని నిమిషాలలో వీరికి దేహస్పృహ యేమాత్రము ఉండదు, ఇదే మెడిటేషన్ అంటున్నారు. దేహస్పృహ పోయినంత మాత్రమున అది మెడిటేషన్ అవుతుందా? బాగా రెండు బాటిల్స్ త్రాగితే దేహ స్పృహ (బాడీకాన్షియస్‌నెస్) పోతుంది. ఇదికూడా మెడిటేషనేనా?! బాడీ కాన్షియస్‌నెస్ పోవాలి, ఆత్మ కాన్షియస్‌నెస్ రావాలి. పాశ్చాత్యులు ఈ మెటీరియల్ లైఫ్‌లో కొంత డిప్రెషన్‌కు

గురికావటంచేత బాడీ కాన్షియస్‌నెస్ పోవటానికి అనేక పద్ధతులు ఉపయోగపెట్టుకుంటూ ప్రచారము చేస్తూ వచ్చారు. కాని, దీనిని ధ్యానమని చెప్పటానికి వీలుకాదు.

ఏకాగ్రత వేరు, ధ్యానము వేరు

ధ్యానమంటే కొందరు 'కాన్‌సన్‌ట్రేషన్' అంటున్నారు. నేనిప్పుడు ఒక పేపరు పట్టుకొన్నాను. దానిలో ఉన్న విషయం "డిస్ట్రిక్ట్ సేవాదళ్ కాన్ఫరెన్స్" అని చదువుతున్నాను. దీనిని చదవటానికి నా కన్నులు అక్కడ కాన్‌సన్‌ట్రేట్ చేయాలి. ఈ చేయి దీనిని పట్టుకోవాలి. మనసు యోచించాలి. బుద్ధి విచారించాలి. బుద్ధి, మనస్సు, కన్నులు యివన్నీ 'కాన్‌సన్‌ట్రేట్' చేసినప్పుడే దీనిని చదవటానికి వీలవుతుంది. కాబట్టి, రీడింగ్‌కు కాన్‌సన్‌ట్రేషన్ ఉండాలి. అట్లే, రైటింగ్‌కు కాన్‌సన్‌ట్రేషన్ ఉండాలి. ప్లేటులోనున్న పదార్థం, "ఇది అప్పడమా, లేక పొటేటోనా" అని కాన్‌సన్‌ట్రేషన్ లేకపోతే తినటానికి వీలుకాదు. డ్రైవింగ్ చేయటానికి కాన్‌సన్‌ట్రేషన్ ఉండాలి. అయితే, ఈ 'కాన్‌సన్‌ట్రేషన్' అనేది 'బిలో సెన్సెస్' (ఇంద్రియ సంబంధమైనది) మెడిటేషన్ అనేది 'బియాండ్ సెన్సెస్' (ఇంద్రియాతీతమైనది). 'బిలో సెన్సెస్' నుండి 'బియాండ్ సెన్సెస్'కి ప్రయాణం చేయాలి. 'బిలో సెన్సెస్'తో ప్రారంభించి క్రమక్రమేణా 'కాన్‌సన్‌ట్రేషన్' నుండి 'కాంటెంప్లేషన్'కు చేరవచ్చు. ఈ 'కాంటెంప్లేషన్' అనే హద్దును దాటిన తరువాత 'మెడిటేషన్' వస్తుంది.

కర్మ - ఉపాసన - జ్ఞానము

కాన్‌సన్‌ట్రేషన్, కాంటెంప్లేషన్, మెడిటేషన్ మూడు స్థాయిలు ఎట్లా ఉంటున్నాయంటే, నీవు ఒక్క వ్యక్తివి కాదు, నీలో ముగ్గురున్నారని నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – నీ దృష్టిలో నీవు, ఇతరుల దృష్టిలో నీవు, అసలైన నీవు. ఈ మూడు స్థాయిలలో మనం ప్రయాణము చేయాలి. దేహపరంగా ఇంద్రియ నిగ్రహము కావాలి, మనస్సుతో ఆత్మాభివృద్ధి చెందాలి, హృదయంతో ఆత్మానందాన్ని అనుభవించాలి.

ఈనాడు సేవాదళ్ సభ్యులందరూ కూడను "వర్క్ ఈజ్ వర్షిప్' అని భావించాలి. దేహముతో 'వర్క్' (కర్మ) చేయాలి. మనస్సుతో 'వర్షిప్' (ఉపాసన) చేయాలి. హృదయముతో 'విజ్‌డం' (జ్ఞానము)లో చేరిపోవాలి. ఈవిధముగా దేహంతో పనిచేస్తూ, మనస్సుతో భగవచ్చింతనచేస్తూ, హృదయంతో ఆనందంలో లీనం కావాలి.

ఐతే, 'వర్క్' చేయకుండా 'వర్షిప్' చేయటానికి వీలుకాదు. 'వర్క్' ఒక పుష్పంవంటిది. ఈ పుష్పాన్ని మనం కాపాడుకుంటూ, పోషించుకుంటూ ఉంటే క్రమక్రమేణా కాయ తయారౌతుంది. ఈ కాయనుకూడ మనము అభివృద్ధిచేసుకుంటే పెద్ద ఫలముగా తయారౌతుంది. ఇక్కడ పుష్పము, కాయ, ఫలము మూడూ వేరుకాదు. పుష్పం లేకుండా కాయ కాలేదు, కాయ లేకుండా పండు కాదు. కనుక, కర్మ – పుష్పము, ఉపాసన – కాయ, జ్ఞానము – ఫలము.

సేవాదళ్‌కి కర్మమార్గమే ఉత్తమం

వ్యక్తిగత సాధన, సమాజసేవ, విశ్వప్రేమ – ఈ మూడింటిద్వారా మన సత్యసాయి సంస్థలను విరివిగా పెంచుకుంటూపోవాలి. ఇతరులను ఉద్ధరించాలని అనుకొన్నప్పుడు, ఇతరులకు సహాయం చేసి వారి దుఃఖమును నివారణ చేయాలనుకొన్నప్పుడు కొంతవరకు మనము కర్మమార్గములోనే ప్రవేశించాలి. దుర్మార్గాన్ని అరికట్టాలనుకొన్నా, అన్యాయ అనాచార అక్రమములను కొంతవరకు పట్టి సాధించాలనుకొన్నా వారి మార్గములో మనము కొంతవరకు వెళ్లవలసివస్తుంది.

ఎట్లనగా, మన ఇంటిలో రాత్రి దొంగ చొరబడ్డాడు. మనము కనుక్కున్న తక్షణమే దొంగ ముండ్లరోడ్డులో పరుగెత్తి పోతున్నాడు. వాడు ముండ్ల రోడ్డులో పోతూంటే మనం తారురోడ్డులో కారు వేసుకుపోతే చిక్కుతాడా?! చిక్కడు. దొంగను పట్టాలనుకొన్నప్పుడు ఆ దొంగ పరుగెత్తిన మార్గములోనే పోవాలి. అదేవిధంగా కష్టజీవులను ఉద్ధరించాలనుకొన్నప్పుడు మనము కష్టములోనే దిగాలి. కనుక, మొట్టమొదట కర్మమార్గములో ప్రవేశించి ఆ కర్మద్వారా వారిని ఉద్ధరించాలి. పవిత్రము గావించాలి. ఈనాడు లోకములో దుష్కర్మలను దూరము చేయాలనుకొన్నప్పుడు మనము కర్మలద్వారానే వాటిని దూరము చేయాలి. కాలిలో విరిగిన ముల్లును ముల్లుతోనే

తీయటానికి ప్రయత్నం చేయాలి. మన బట్టకంటిన మట్టిని పోగొట్టుకోవాలంటే తిరిగి మట్టితోనే కడగాలి. దీనినే పూర్వకాలంలో 'చవుడు' అని చెప్పేవారు. ఈనాడైతే సబ్బులు వచ్చినాయికాని, పూర్వం మట్టితోనే మురికిని పోగొట్టటానికి ప్రయత్నించేవారు. వజ్రాన్ని కోయాలనుకొన్నప్పుడు వజ్రముతోనే కోయాలి. అదేవిధముగా కర్మను కర్మతోనే మనము సాధించాలి. కనుక, సేవాదళమువారికి కర్మమార్గము చాలా పవిత్రమైన, ఆదర్శవంతమైన మార్గము.

ప్రేమస్వరూపులారా! గడచిపోయిన సమావేశముల కంటె ఈ సమావేశాన్ని మరింత పవిత్రమైన, సార్థకమైన సమావేశముగా మీరు భావించి, ఈ సమావేశములో నిర్ణయించిన నిర్ణయాలను ఆచరణలో పెట్టటము, పెట్టించటము, చేయటము, చేయించటముకూడను జరిపించి మన సంస్థలను అభివృద్ధి గావించి, విరివిగా పెంచి దేశానికి సరియైన నాయకులుగా ఆదర్శం నిరూపిస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. **(సేవాదళ్ సమ్మేళనం, 1979 మే 25)**

మళ్ళీ చిన్నపిల్లలుగా తయారుకండి!

ప్రేమస్వరూపులారా! మీరందరూ మళ్ళీ చిన్న పిల్లలుగా తయారైతే నాకెంతో ఆనందము. పిల్లలలో కోపతాపములు, అసూయ, డంబము, అహంకారమువంటి దుర్గుణాలు ఉండవు. ఒక పర్యాయం ఏసుక్రీస్తు తన చుట్టూ చేరిన గుంపులో ఒక తల్లివద్ద చంటిబిడ్డను చూశాడు. ఆ బిడ్డను ఎత్తుకొని, "ఈ చంటిబిడ్డ అంటే నాకెంతో ప్రీతి. ఎందుకంటే, ఈ బిడ్డయొక్క భావములన్నీ భగవంతుని భావములవలె నిర్మలమైనవి, నిశ్చలమైనవి, నిస్స్వార్థమైనవి" అన్నాడు.

పెరిగేకొలదీ పిల్లలలో ఆశా పాశములు, కోపతాపములు ప్రారంభమౌతుంటాయి. వాటితో పాటు విచారములుకూడా పెరుగుతుంటాయి. కనుకనే, వయస్సు పెరిగేకొలదీ కోరికలను తగ్గించుకుంటూ రావాలి. కోరికపై మనం అదుపు సాధించాలి. అప్పుడే మనలో దైవశక్తి ఆవిర్భవిస్తుంది. వయస్సు పెరిగే కొలదీ మనలోని ఆశలే మనలను క్రుంగదీస్తున్నాయి. కాబట్టి, ఆ మాయను మనం పూర్తిగా తొలగించుకోవాలి. చిన్నబిడ్డలకు ఎంత నిర్మలమైన భావము! ఎంత నిశ్చలమైన తత్త్వము! ఎంత నిస్స్వార్థమైన సంకల్పము! అదియే దైవత్వమునకు చిహ్నము. మనము అట్టి నిర్మలమైన, నిశ్చలమైన, నిస్స్వార్థమైన భావములతో జీవించాలి. ప్రేమస్వరూపులారా! దినమునకు కనీసం ఒక్క నిమిషమైనా మీరు చిన్నపిల్లలుగా తయారుకండి. కోరికలు తలెత్తితే 'ఛీ, ఇవి నాకు తగినవి కావు' అని వాటిని ప్రక్కకు నెట్టండి. ఆవిధంగా కోరికలను ఛీకొట్టినప్పుడే మనం ధైర్యంగా నిలువగలము.

– బాబా (28.8.2004)

బాబా బాటలో జీవించండి

ఎమ్.ఎస్. ప్రకాశరావు

గౌరవనీయులైన వ్యక్తులు, ప్రముఖులూ, అతిథులూ పాఠశాలలను సందర్శించడం సాధారణ విషయమేమీ కాదు. కానీ, శ్రీ సత్యసాయి విద్యావిహార్, విశాఖపట్నంలోని అందరి హృదయాలలో తేదీ 8.3.2009 శుక్రవారం చెరగని ముద్ర వేసిన రోజు.

మహనీయులు, అత్యంత ప్రేమపాత్రులూ, భారతదేశ మాజీ రాష్ట్రపతి, 'భారతరత్న' డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ మన ఆహ్వానాన్ని మన్నించి శ్రీ సత్యసాయి విద్యావిహార్‌ను దర్శించటం అద్వితీయమైన లీవి, శోభ, వైభవం చిందించిన దృశ్యం. ఉత్సాహవంతులైన పిల్లలతో శ్రీ కలామ్ గడిపిన క్షణాలు, కార్యోన్ముఖత కలిగించే ఉత్తేజపూరితమైన సంభాషణ అత్యంత విలువైనవి.

శ్రీ కలామ్ విద్యార్థులతో జరిపిన సంభాషణను తెలుసుకుందాం.

డాక్టర్ కలామ్: మీలో ఎంతమంది సాయిబాబావారి బాటలో నడిచి సమాజ సేవకులు కావాలనుకుంటున్నారు? (పిల్లలందరూ సానుకూలంగా చేతులెత్తారు)

డాక్టర్ కలామ్: మీరందరూ మంచి పిల్లలు. స్నేహితులారా! మీ అందరితో కలిసి సంభాషించడం నాకెంతో సంతోషంగా ఉంది. ఎందుచేతనంటే, మీ అందరిలో నేను సాయిబాబావారిని చూస్తున్నాను. బాబావారి గురించి నేను తెలుసుకున్న అపురూపమైన విషయం ఏమిటంటే, వారు ఏ వాగ్దానం చేసినా దానిని ఆచరించి, సాకారం చేసి చూపిస్తారు. అందుకే, "నేను ఆచరించి తరువాతనే బోధిస్తాను" అని వారు చెబుతూ ఉంటారు. నేను భగవాన్‌ని పుట్టపర్తిలోనూ, వైట్‌ఫీల్డులోనూ చూశాను. కృష్ణా జలాలు మద్రాసుకు వస్తాయని వారు చెప్పారు. వారు చెప్పింది జరిగి తీరుతుంది. జరిగిందికూడా. "నేను పల్లెవాసులకు మంచినీరిస్తాను, అత్యాధునికమైన ఆస్పత్రులను నిర్మిస్తాను" అని చెప్పారు. చేసి చూపించారు. దీనిని బట్టి భగవాన్ సందేశమేమిటంటే, "నువ్వు దేన్ని నమ్మినా దానిని ఆచరించి చూపాలి" అని.

మరి ఇటువంటి గొప్ప సంస్థలో చదువుకుని బయటకు వెళ్ళినప్పుడు మీతో ఏం తీసుకు వెళ్తారు?

విద్యార్థులు: (అన్ని వైపులనుండీ) మానవతా విలువలు, మంచి నడత, ప్రేమ, మంచి స్మృతులు...

డాక్టర్ కలామ్: ముఖ్యంగా మీరు జ్ఞానాన్ని తీసుకు వెళ్తారు. జ్ఞాన సమీకరణాన్ని మీకిస్తాన్నేను.

జ్ఞానము = సృజనాత్మకత + ధర్మము + ధైర్యము

ఇవన్నీ బాబావారు బోధించినవే!

నేను చెప్పేదాన్ని మీరూ అనుసరించండి.

చదువు సృజనాత్మకత నిస్తుంది. సృజనాత్మకత జ్ఞానాన్నిస్తుంది.

జ్ఞానం మిమ్మల్ని గొప్పవారిని చేస్తుంది, బాబావంటి మహనీయుల్లా.

భగవాన్ సన్నిధిలో డా॥ అబ్దుల్ కలామ్

హృదయంలో ధర్మం ఉంటే నడతలో అందం ఉంటుంది.

నడతలో అందం ఉంటే ఇంటిలో సయోధ్య ఉంటుంది.

ఇంటిలో సయోధ్య ఉంటే, దేశంలో క్రమశిక్షణ ఉంటుంది.

దేశంలో క్రమశిక్షణ ఉంటే ప్రపంచంలో శాంతి నెలకొంటుంది.

స్నేహితులారా! మరొక ముఖ్య విషయం కలిగి ఉంటే ప్రతి ఒక్కటీ సంభవమే!

ఆ ముఖ్య విషయం ఏమిటి?

విద్యార్థులు (ముక్తకంఠంతో): ధర్మం

డాక్టర్ కలామ్: ఔను, విద్యార్థులారా! చాలామంచి మాట చెప్పేరు. హృదయంలో ధర్మం ఉంటే, నడతలో అందం ఉంటుంది. ఇంటిలో ఆత్మీయత ఉంటుంది. దేశంలో క్రమశిక్షణ ఉంటుంది. ప్రపంచంలో శాంతి ఉంటుంది. బాలల్లారా! హృదయంలో ధర్మాన్ని ఎవరివ్వగలరు?

విద్యార్థులు: (అన్ని వైపులనుండి సమాధానాలు వచ్చేయి) బాబా, గురువు

డాక్టర్ కలామ్: మంచిది. ముగ్గురే మీ హృదయంలో ధర్మాన్ని నాటగలరు. తల్లీ, తండ్రీ, మీ ప్రాథమిక ఉపాధ్యాయుడూ. ఈ ఆధ్యాత్మిక వాతావరణంలో చదువుకుంటున్న మీలో ఎంతమంది ప్రాథమికోపాధ్యాయుల్ని ఇష్టపడతారు?

(విద్యార్థులందరూ చేతులెత్తారు)

డాక్టర్ కలామ్: అయితే, మీ అందరూ మీ ప్రాథమిక ఉపాధ్యాయుల్ని ఇష్టపడతారన్నమాట. నేనుకూడా మీలాగే నా ప్రాథమికోపాధ్యాయుణ్ని ఇష్టపడతాను. వారు శ్రీ శివసుబ్రహ్మణ్య అయ్యర్. అందుచేత, మనకి మంచి ప్రాథమికోపాధ్యాయుడు ఉంటే మనం గొప్ప పౌరులమవుతామన్నమాట. ఇప్పుడు మూడవది ఏమిటి?

విద్యార్థులు: (ఆత్మవిశ్వాసంతో సమాధానమిచ్చారు) ధైర్యం.

డాక్టర్ కలామ్: అవును, ధైర్యమే! బాలబాలికలందరూ భిన్నంగా ఆలోచించడానికి ధైర్యం కావాలి. కనిపెట్టడానికి, ఎవరూ శోధించని బాటలో పయనించడానికి ధైర్యం కావాలి. సమస్యతో పోరాడి విజయం సాధించడానికి ధైర్యం కావాలి. ఇవి యువతకు అపురూపమైన లక్షణాలు. "దేశ యువతగా నేను కష్టించి పనిచేస్తాను, అన్నింటిలో విజయం సాధించేలా ధైర్యంగా పనిచేస్తాను." అదీ మీరు చెప్పాలి.

మరి జ్ఞానము అంటే ఏమిటి?

3

విద్యార్థులు: సృజనాత్మకత + ధర్మం + ధైర్యం

డాక్టర్ కలామ్: బాలలూ! ఈ సంస్థనుండి బయటికి వెళ్ళేటప్పుడు సృజనాత్మకతనీ, హృదయంలో బాబా బోధించిన విధంగా ధర్మాన్నీ, గొప్ప పౌరులు కావాలనే ధైర్యాన్నీ తీసుకు వెళ్లాలి.

మీలో ఎంతమంది డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారు?

(అందరూ చేతులెత్తారు)

ఒక విద్యార్థి: నేను రాజకీయ నాయకుణ్ని కావాలనుకుంటున్నాను.

డాక్టర్ కలామ్: యువకులు రాజకీయాల్లోకి రావడం మంచిదే! నువ్వు రాజకీయాల్లో ఎందుకు చేరదామనుకుంటున్నావు?

విద్యార్థి: అక్షరాస్యతను పెంచేందుకు.

డాక్టర్ కలామ్: చాలా మంచిది, చాలా మంచిది. మీలో ఎంతమంది కుజ గ్రహంపైకి వెళ్ళాలనుకుంటున్నారు?

(అందరు పిల్లలు చేతులెత్తారు)

డాక్టర్ కలామ్: బాలలూ! మీ అందరూ కలిసి నాతో ప్రమాణం తీసుకోవాలి. నాతో కలిసి చెప్పండి:

"నేను ఏ వృత్తిని చేపట్టినా దాన్ని ప్రేమిస్తాను. దానిలో అసాధారణమైన ప్రజ్ఞ కనబరుస్తాను. నేను ఒక మొక్కను నాటి దాన్ని చెట్టుగా పెంచుతాను. నేను పల్లెసీమలకూ, పట్టణ ప్రాంతాలకూ వెళ్లి కనీసం ఐదు శాతం మంది ప్రజల్ని మద్యపానం, జూదం వంటి దురలవాట్లనుండి సంస్కరిస్తాను. (పిల్లలందరూ ముక్తకంఠంతో ప్రమాణం చేశారు)

ఇప్పుడు పెద్దలు చెప్పండి. ఎందుకంటే, ఇది పిల్లలకు ఆదర్శం అందించడానికి ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ, ఇతరులూ నిర్మలమైన బుద్ధి, మనస్సుకోసం ముక్తకంఠంతో చేసే ప్రమాణం:

"నేను లంచగొండితనం లేని నీతివంతమైన జీవితం గడుపుతాను. ఇతరులకు ఆదర్శంగా ఉండే పారదర్శకమైన జీవితాన్ని అలవరచుకుంటాను. నిజాయతీతో పనిచేస్తాను, నిజాయతీగా విజయం సాధిస్తాను. (అందరూ సామూహికంగా ప్రమాణం చేశారు)

తన ఆదర్శాలూ, వేదాంతం, నిరాడంబరమైన జీవితం ఆధారంగా భారతరత్న డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్‌ని ఈతరం గాంధీగా పరిగణించవచ్చు. పిల్లలపై అవధుల్లేని ప్రేమ కారణంగా ఆయన ఈతరానికి చాచా నెహ్రూ కూడా. ❊

అందరూ భగవంతుని బిడ్డలే!

అందరినీ నీవు ప్రేమించు. ఎవ్వరినీ ద్వేషించకు. అందరిలోనూ నేనున్నాను. నా రహస్యంకూడా అదే! నువ్వు నా ఆశీస్సులు పొందాలనుకుంటే, ప్రేమను అభివృద్ధి చేసుకో! క్రోధము, ఈర్ష్య, అసూయలను నీ దరి రానీయకు. నీవు నిష్కాగరిష్ఠుడవా? నీకు ఉపనిషత్తులలో పాండిత్యం ఉందా? అనేది నాకక్కర్లేదు. నీ హృదయం నుండి ద్వేషాన్ని పారద్రోలి, ప్రేమను పెంచుకుంటే, కాలక్రమంగా నీ శత్రువులే నీకు మిత్రులవుతారు. దుర్మార్గులెవ్వరూ లేరు. వాళ్ళు అజ్ఞానులే! కాలరూపుడైన భగవంతుడే వాళ్లను సంస్కరిస్తాడు.

- బాబా

సర్వాంతర్యామి

డా॥ కె.వి. కృష్ణకుమారి

"మానవ జీవితము భగవంతుని వరప్రసాదము. దేహము దేవుని నివాస స్థానము. లోపల దేవుడు లేకపోతే దేహము అపవిత్రతను పొందుతుంది. కేవలం తిని, త్రాగి, తిరుగుతూ జీవితమును వ్యర్థము చేయక విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞాన దీపములను వెలిగించుకొని నిజ గమ్యమును చేరుటకు ప్రయత్నించాలి. సర్వత్రా వ్యాపించిన దేహి, దేహమునందు ప్రవేశించిన అది దేవాలయమవుతుంది. భగవానుడు సర్వత్రా ఉన్నాడు. ఆయన దేహములో ప్రవేశించి, ప్రకాశించుచున్నాడు. అన్ని దేహములూ ఆ పరమాత్మునియొక్క అవతారములే! కల్పించిన దేవాలయములందు కల్పించిన దేవుడుంటే, సర్వుల హృదయస్థానమందూ, స్వస్వరూపమైన, స్వయం జ్యోతియైన పరమాత్ముడున్నాడు. మానవునకూ, మాధవునకూ నిజమైన శాశ్వతమైన బాంధవ్యమిదే! దీనిని తెలుసుకొనిన మానవునకు పరమాత్ముడు సర్వ హృదయ వాసిగా, సర్వత్రా ప్రకాశించుచున్నాడని సులభముగా అనుభవమవుతుంది" అన్నారు స్వామి.

కానీ, ఈ సత్యాన్ని ఎందరు గ్రహిస్తున్నారు?! స్వామి ఉద్బోధను ఎందరు ఆచరణలో పెట్టగలుగుతున్నారు?! అసూయ, ద్వేషం, స్వార్థం, పగ, ప్రతీకారాలకు ఎందరు దూరంగా ఉండగలుగుతున్నారు?! ఈ పాంచభౌతిక శరీరాలలో దైవత్వము ఉందని ఎందరు గ్రహించ గలుగుతున్నారు?! అజ్ఞానంవల్లా, ప్రారబ్ధంవల్లా దైవత్వాన్ని దూరం చేసుకుంటూ, శివత్వాన్ని పొందవలసిన శరీరాన్ని శవతుల్యం చేసుకుంటున్నారు.

దివ్యాత్మస్వరూపులుగా, ప్రేమాత్మస్వరూపులుగా, ఆనందస్వరూపులుగా, అమృతాత్మస్వరూపులుగా, అమృత స్వరూపులుగా మనల్ని మార్చాలన్నదే స్వామి లక్ష్యం. దివ్యాత్మ ప్రబోధంద్వారా మనలోనూ, ఎదుటి జీవిలోనూ గల దివ్యాత్మను దర్శింపజేసి, మానవ సేవలో మాధవసేవనూ, లోకసేవలో లోకేశుని సేవనూ, జనసేవలో జనార్దనుని సేవనూ స్వామి మనచేత చేయిస్తున్నారు. పశు మానవత్వమునుండి మానవ మానవత్వమునకు, మానవ మానవత్వమునుండి మానవ దైవత్వమునకు స్వామి మనలను చేరవేస్తున్నారు.

స్వామి ప్రేమస్వరూపులు. ప్రేమమయ జీవితమువల్లనే స్వామి సాన్నిధ్యము దొరుకుతుంది. ప్రేమ లేకపోతే జీవితము లేదు. *"నేను ప్రేమమయుడను. నా ఆనందమును ప్రేమతో అందరికీ అందిస్తున్నాను. మీరు కూడా ప్రేమమయులు కావాలని ఆశిస్తున్నాను. నా మాట ప్రేమపూరితము. నా బాట ప్రేమమయము. మీరు నా బాటలో నడవాలన్నదే నా ఆకాంక్ష"* అంటారు స్వామి.

"మీ దైవములో, మీ పవిత్ర భావములో, మీ పరమానందములో, మీ ఆధ్యాత్మిక మధురిమలో మునిగిపోండి. దానినుండి తప్పించుటకు ఎవరెన్ని పన్నాగములు పన్నినా ప్రాణమునైనా విడుచుటకు సిద్ధం కండి. అంతేగాని, ఆ దివ్యానుభూతిని, దివ్యానందమును విడుచుటకు ప్రయత్నించకండి" అంటూ హెచ్చరికలు చేస్తారు స్వామి.

మనం అమృత స్వరూపులమే! అమృతత్వం మన స్వరూపం. ఈ జీవితం మరణం నుండి అమృతత్వంవైపుకు సాగే యాత్ర. మన విద్యలు, శాస్త్రములు, ఉపనిషత్తులు, తర్కములు మనలను మృత్యువునుండి కాపాడలేవు. "నహి నహి రక్షతి డుకృఞ్ కరణే". ఐతే, దేహమునకు మాత్రమే మృత్యువు వస్తుంది. పుట్టినది మాత్రమే గిట్టుతుంది. పుట్టనటువంటి ఆత్మకు గిట్టుట అనేదే లేదు.

చావు పుట్టుకలు లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంత రహితు డనాదివాడు
తాను చావక పుట్టక చంపబడక
అంతటను సర్వసాక్షియై ఆత్మ వెలుగు



అమృతత్వం స్వామి స్వరూపంలో కనిపిస్తుంది.

"ప్రేమే నా స్వరూపము.
సత్యమే నా శ్వాస.
ఆనందమే నా ఆహారము.
నా జీవితమే నా సందేశము.
ప్రేమకు కారణము లేదు, కాలమూ లేదు.
జన్మమృత్యువులూ లేవు"

అంటారు సచ్చిదానందస్వరూపులైన స్వామి.

అమృతత్వమంటే దీర్ఘకాల జీవితము కాదు. మానవత్వములోని దివ్యత్వమును గుర్తించి వర్తించే సాధన. మనం ఆశించవలసింది దీర్ఘ జీవితము కాదు, దివ్య జీవితము. స్వామి ఆశించేదీ అదే, మనపరంగా కోరుకునేదీ అదే!

స్వామి సంకల్పమాత్రాన్నే మనలను తమ ఆశయ సిద్ధివైపుకి మరల్చుకోగలరు. కానీ, భగవానుని ఆశయం మనలను తీర్చిదిద్దాలనే, దైవత్వంవైపుకు మనలను నడిపించాలనే!

అందరినీ 'బంగారూ' అని పిలిచే స్వామి – బంగారాన్ని కొలిమిలో కాల్చి అందమైన నగగా మార్చి అంతరంగంలో అలంకరించుకోవాలని ముచ్చటపడతారు. తద్వారా మన జీవితాలకు చరితార్థతను ప్రసాదిస్తారు, ప్రసాదిస్తున్నారు.

మానవజాతి నంతటినీ ఒకే కుటుంబంగా ఏకం చేసి, మనలోని ప్రతి ఒక్కరిలో ఆత్మ సత్యమును స్థిరముగా నెలకొల్పి ప్రకాశింపజేయుటకే స్వామి అవతరించారు. నవయుగానికి వైతాళికులు అవసరమనీ, స్వార్థమూ, దురాశా, ద్వేషమూ, హింసలను వదలిపెట్టి జ్యోతి స్వరూపులుగా మారి ఇతరులకు వెలుగుబాటను చూపించగలగాలని స్వామి నిరంతరం మనకు ఉద్బోధిస్తూనే ఉన్నారు.

ఒకరోజున ఇంటర్వ్యూ రూమ్‌లో నా ప్రశ్నకు సమాధానంగా, *"అందరిలో దేహాభిమానం ఎక్కువైంది బంగారూ, దేహాన్ని ప్రేమించినంతగా ఆత్మస్వరూపుడైన దేహిని ప్రేమించలేకపోతున్నారు. దివ్యత్వాన్ని అలక్ష్యం చేస్తున్నారు. నా ఈ శారీరక బాధలను నేను ఎవరి దగ్గరనుంచీ తీసుకోలేదు. దేహపరంగా వచ్చినవికూడా కాదు. కేవలం ఈ దేహి సంకల్పమే దీనికి కారణం. ఈ ఫ్రాక్చర్‌వల్లా, గాయాలవల్లా నాకెటువంటి బాధాలేదు, ఉండదు. అందరూ దేహపరమైన భ్రాంతిని పోగొట్టుకోవాలనీ, చిన్మయానందాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా ఆశయం. శారీరకపరంగా నాకెన్ని బాధలు కలిగినా నేను అనుక్షణం ఆలోచించేది మీ బాధలగురించే... మీకు స్వస్థత చేకూర్చాలనే! దేహధారిని అయినందుకు ఈ శరీరానిక్కూడా బాధలు తప్పవు. అయినా, మీ బాధలే నాకు బాధను కలిగిస్తాయి, వాటి నివారణే నా లక్ష్యం"* అంటూ బాధలనుకూడా బోధలుగా మారుస్తారు స్వామి.

భౌతికంగా మనకు దూరమై, దైవాభిమానాన్ని పెంచుకోమని, దేహాభిమానం శాశ్వతం కాదనీ మనకి మరోసారి సుస్పష్టపరిచారు.

స్వామి భౌతికంగా మనకు దూరమైపోయారు. ఐతే, ఆత్మపరంగా అంతరాత్మపరంగా మనకు అద్వైత స్థితిని సుస్థిరం చేశారు. స్వామి మనపరంగా ఆశించేది ఆ స్థితినే! అయినా స్వామి దూరమవటమేమిటి?! అనంతుడు అంతర్ధానమవటమేమిటి?!

శ్రీరాముడు నామస్మరణమాత్రాన్నే మన అంతరంగంలో ప్రత్యక్షమవటం లేదా?!

శ్రీకృష్ణుడు తలచినంతనే వేణుగానంతో మనలను ఆనందపరవశుల్ని చేయటం లేదా?!

అలాగే సాయికృష్ణుడు స్మరణమాత్రాన్నే మనకు దర్శనమిస్తున్నారు, మనల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

స్వామి శరీరధారిగా ఉన్నప్పుడు సకల జీవులనూ ప్రభావితులను చేసి తన దగ్గరకు ఆకర్షించుకున్నారు, సేదతీర్చారు. స్వామి విశ్వవిభూతి తత్త్వం అందరినీ చైతన్యవంతుల్ని చేసేది, మధుర భక్తిభావనలకు వారసుల్ని చేసేది.

ఇప్పుడు ప్రకృతిలోని ప్రతి అణువునా, అణువణువునా స్వామి మనకు దర్శనమిస్తూనే ఉన్నారు. స్మరణ మాత్రాన మనకు సాక్షాత్కార భాగ్యాన్ని ప్రసాదిస్తున్నారు. మన హృదయ మందిరాలలో కొలువై నిలుస్తున్నారు. కోట్లాది భక్తులను ప్రభావితం చేస్తున్నారు. స్వప్న దర్శనాలతో మేల్కొల్పుతున్నారు. "నేను స్వప్నంలో సాక్షాత్కరించానంటే, అది కేవలం నా సంకల్పంవల్లనే సాధ్యం. నా స్వప్న దర్శనం కల కాదు, యథార్థమే" అంటారు స్వామి.

స్వప్నంలోనూ, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, అప్పటిలాగానే, ఎప్పటిలాగానే ఇప్పుడూ మనల్ని చైతన్యవంతుల్ని చేస్తూనే ఉన్నారు స్వామి. అంధకారం నుంచి వెలుగులోకి, అజ్ఞానంనుంచి జ్ఞానపథంవైపుకూ, అగమ్యం నుంచి గమ్యంవైపుకు మనలను నడిపిస్తూనే ఉన్నారు. తన విశ్వవిభూతి తత్త్వాన్ని అనుక్షణం మనకు ఎఱుకపరుస్తూనే ఉన్నారు.

మన హృదయంలో పదిలంగా ఉన్న మన స్వామిని మరింతగా పదిలపరచుకుందాం. మధుర ప్రేమ తత్త్వంతో సుస్థిరపరచుకుందాం.

స్వామి మనకు ప్రసాదించిన, ప్రసాదిస్తున్న మధురామృతధారలను మన హృదయ మందిరాలలో నిక్షిప్తపరచుకుందాం.

సర్వులకూ పంచి చరితార్థులమవుదాం! ❈

సనాతన సారథి

FORM 4 (రూల్ నెం.8 చూడండి)

1.	ప్రచురణ స్థలము	:	*శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్, ప్రశాంతినిలయం, అనంతపురం జిల్లా-515134*
2.	ప్రచురణ ఎన్నాళ్ళకు?	:	ప్రతి మాసమునకు
3.	ముద్రాపకుడు, ప్రచురణకర్త	:	శ్రీ కె.ఎస్. రాజన్
	భారతీయ పౌరుడా?	:	అవును
	చిరునామా	:	*WEST 2, C - 22, ప్రశాంతి నిలయం- 515134*
4.	సంపాదకుడు	:	శ్రీ బి.వి. రమణరావు
	భారతీయ పౌరుడా?	:	అవును
	చిరునామా	:	*WEST 1, B - 27, ప్రశాంతి నిలయం- 515134*

5. తేదీ 28.2.2013 నాటికి ఈ పత్రికయొక్క స్వంతదారులు మరియు మొత్తం మూలధనంలో ఒక శాతం కంటే ఎక్కువవాటా కలిగిన భాగస్వాములు లేక షేరు హోల్డర్లయొక్క పేర్లు, చిరునామా : శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా - 515134

కె.ఎస్. రాజన్ అను పేరుగల నేను పైన వివరింపబడిన విషయములన్నీ నాకు తెలిసినంతవరకు నిజమని ఇందుమూలముగా ధ్రువీకరించుచున్నాను.

తేదీ 1.03.2013 (సం॥) కె.ఎస్. రాజన్

ఎవరెంత దూరం!

వై. శ్రీరంగనాథ రాజు

2007వ సంవత్సరంలో చెన్నై మహానగరంలో అతిరుద్ర మహాయజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. ఆ సందర్భంలో భగవాన్ కొంతమంది విద్యార్థులను తమ వెంట చెన్నైకి తీసికొని వెళ్ళారు. ఒకనాటి సాయంత్రం స్వామి బయటకు వెళుతున్నారని కబురు వచ్చింది. సాధారణంగా విద్యార్థులుకూడా స్వామి వెంట వెడతారు. పరుగుపరుగున అందరం వెళ్ళి స్వామివారి గదిముందు నిలబడ్డాము. అప్పుడే గదిలో నుండి బయటకు వచ్చిన ఒక సోదరుని అడిగాను, స్వామి ఎక్కడికి వెడుతున్నారని. అతను నవ్వి, "నాకు తెలియదు. మీకేమైనా తెలుసునేమోనని అడగటానికి వస్తున్నాను" అన్నాడు.

స్వామివారి ప్రయాణాలగురించి చెప్పగల్గే సన్నిహిత భక్తులొకరు అక్కడున్నారని గమనించి స్వామి ఎక్కడికి వెడుతున్నారని వారినికూడా అడిగాను. ఆయన కూడా నాకు తెలియదంటూ నవ్వారు. ఇంతలో స్వామి బయటకు వచ్చారు. అందరూ ఒకరి ముఖం ఒకరు చూస్తూ స్వామిని చూస్తూ నిలబడ్డారు. అప్పుడు అర్థమైంది, అక్కడున్న ఏ ఒక్కరికీ స్వామి ఎక్కడికి వెడుతున్నారో తెలియదని. స్వామి మా ప్రక్కనే ఉన్నా ఆ క్షణంలో ఎంతో దూరంగా ఉన్నట్లు అనిపించింది. మా అందరికీ స్వామికీ మధ్య కనబడని అగాధం ఒక్కసారిగా బయటకు కనిపించింది.

కొన్ని సంవత్సరాల క్రితం కొంతమంది భక్తులతో కలిసి ఒక యోగివద్దకు వెళ్ళాము. ఆయన సాధారణంగా తనవద్దకు స్వామి భక్తులు వచ్చినప్పుడు మధ్యాహ్న సమయంలో స్వామివారి దర్శనాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించేవారు. స్వామి ఏ సమయంలో బయటికి వచ్చిందీ, ఏ వ్యక్తిని పలకరించిందీ, ఎవరి దగ్గరనుండి ఉత్తరం తీసుకున్నదీ స్వయంగా చూస్తున్నట్లే చెప్పేవారు.

ఇంతకీ స్వామికి ఎవరు దగ్గర? స్వామి మందిరంలో స్వామి ప్రక్కనే నిలబడినా మరుక్షణంలో వారు ఏమి చేస్తారో తెలియని మేమా? లేక వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్నా స్వామి ప్రతి కదలికనూ వీక్షించే ఆ యోగిపుంగవుడా?

ఒకసారి మహారాష్ట్ర భక్తులు స్వామి సమక్షంలో ఒక నాటికను ప్రదర్శిస్తున్నారు. అది పండుగ సందర్భం కాబట్టి స్వామి మాట్లాడమంటారేమోనని కొంతమంది విద్యార్థులం వార్డెన్ గారి అనుమతితో వేదికమీద స్వామి సింహాసనానికి సమీపంలో కూర్చున్నాము. అక్కడినుండి సాయి కుల్వంత్ హాలు అంతా కనిపిస్తుంది. హాలులో క్రిక్కిరిసిన జన సందోహం కనబడుతుంది. నాటిక చాలా రసవత్తరంగా సాగుతోంది. స్వామి వెంట ఉండే ఇద్దరు విద్యార్థులుకూడా సింహాసనానికి ఇరువైపులా కూర్చొని నాటికను చూస్తున్నారు. దర్శన సమయంలో భక్తులు ఇచ్చిన ఉత్తరాలలో ఒక ఉత్తరం స్వామి చేతిలోనే ఉన్నది. దానిని కుడివైపున కూర్చున్న విద్యార్థికి ఇవ్వడానికి స్వామి చెయ్యి వంచారు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండే ఆ విద్యార్థి ఆ సమయంలో మాత్రం నాటికలో నిమగ్నమై స్వామి తనకు ఉత్తరం అందిస్తున్న విషయాన్ని గమనించలేదు. ఎడమ వైపు కూర్చున్న విద్యార్థి ఇది గ్రహించి స్వామినుండి ఆ ఉత్తరాన్ని అందుకోవడానికి చేయి చాచాడు.

సాయికుల్వంత్ హాలు చివరలో కూర్చుని స్వామి చూపుకై ఎంతో ప్రయత్నిస్తూ పరితపిస్తున్న ఒక వృద్ధ భక్తుణ్ని చూపిస్తూ స్వామి, so far yet so near (ఎంతో దూరం అయినా ఎంతో దగ్గర), పక్కనే కూర్చుని నాటికలో నిమగ్నమైన ఈ విద్యార్థిని చూస్తూ, so near yet so far (ఎంతో దగ్గర అయినా ఎంతో దూరం) అని సైగ చేస్తూ నావైపు చూసి నవ్వారు.

అప్పుడు తెలిసింది, మనిషి దృష్టికి శరీరాల మధ్య దూరం కనబడుతుంది. భగవంతుని దృష్టికి మనసులో ఉన్న దూరం కనబడుతుంది. భక్తి అంటే భగవంతునితో భౌతిక సంబంధం కాదు, మానసిక అనుబంధం. ❊

ఎవరికి ఎంత అవసరమో అంతే!

పలివెల సుబ్బారాయుడు

1983 ఆగస్టు 14వ తేదీనుండి 5 రోజులపాటు ప్రపంచస్థాయి శ్రీ సత్యసాయి బాలవికాస్ తృతీయ వర్గ గురువుల శిక్షణా తరగతులు ప్రశాంతి నిలయంలో జరిగినవి. విదేశాలనుండి 400 మంది, భారతదేశం నుండి 600 మంది శిక్షణ పొందడానికి వచ్చారు. బాలవికాస్ గురువుగా అందులో శిక్షణ పొందే అవకాశం నాకుకూడా కలిగింది.

18.8.1983తో శిక్షణా తరగతులు ముగిసినవి. మరునాడు పూర్ణచంద్ర ఆడిటోరియంలో మా అందరికీ స్వామివారు పాదనమస్కారం, విభూతి ప్రసాదం అనుగ్రహించారు. స్వామి వేసే విభూతి ప్యాకెట్లు ఒక్కో దోసిలిలో నాలుగో ఐదో పడుతున్నాయి. నా దోసిలిలో మాత్రం కేవలం రెండే ప్యాకెట్లు పడ్డాయి. "స్వామీ, మరీ రెండేనా?!" అని మనస్సులోనే ఆర్తిగా అనుకున్నాను. స్వామి అప్పటికే ఆరడుగుల దూరం వెళ్ళారు. అక్కడినుండి ఓరగా నావైపు చూస్తూ తమాషాకా అన్నట్లు ఒక ప్యాకెట్టును రెండు వ్రేళ్ళ సందున పట్టి, 'టప్'మని పైకి కొట్టారు. అది గాలిలో ఎగురుకుంటూ వచ్చి నా దోసిలిలో పడింది. మొత్తం మూడు ప్యాకెట్లు కళ్ళకద్దుకొని జేబులో పెట్టుకున్నాను.

22వ తేదీ ఓణం పండుగ చూసుకొని వెళదామని ఆగిపోయాను. ఆరోజు రాత్రి నేనున్న గణేశ్ షెడ్డులో నా తలవైపు పడుకున్న ఆయన పెట్టే గురకతో షెడ్డు దద్దరిల్లుతున్నది. సుమారు పదిమంది పిల్లలు దెబ్బలాడుకుంటే వచ్చే గందరగోళాన్ని మించి ఉన్నది. నిద్రపట్టక లేచి కూర్చున్నాను. లేచి ఆయనను చూద్దును కదా... ఆయన బాణం కర్రలా వంగి రెండు చేతులమధ్య తలదూర్చి మోకాళ్లపై ఆనుకుని పడుకుని ఉన్నాడు. డొక్కలు లోనికి బయటికి కొలిమితిత్తిలా ఊగుతున్నాయి. అతి కష్టంమీద ఊపిరి పీల్చుకొని వదులుతున్నాడు. నేను ఆయనతో, "సార్, మీకు బాగా జలుబు చేసినట్లుంది. నాదగ్గర జండూ బామ్ ఉంది. రాసుకుంటారా?" అని అడిగాను.

ఆయన అతి కష్టంమీద తన పెట్టె చూపుతూ, "దానినిండా ఉన్నాయి మందులు. మాది కోయంబత్తూరు. నాల్గు సంవత్సరాల నుంచి నేను ఒక విచిత్రమైన ఎలర్జీతో బాధపడుతున్నాను. రెండు ముక్కు రంధ్రాలనుండి తీగలు తీగలుగా ఒక ద్రవం వచ్చేస్తుంటుంది. కోయంబత్తూరులోనూ, మద్రాసులోనూ డాక్టర్లు చూశారు. మందు లేదన్నారు. ఒక సత్యసాయి భక్తుడు పుట్టపర్తి వెళ్ళు, ఆ దేవుడే నీకు తగ్గించాలని సలహా ఇచ్చాడు. గతంలో మూడుసార్లు వచ్చి వెళ్లాను. స్వామి అనుగ్రహించలేదు. ఇది నాలుగో ట్రిప్పు" అన్నాడు.

అప్పుడు నేను, "అయ్యా, 19వ తేదీన స్వామి నాకు విభూతి ప్రసాదం ఇచ్చారు. అది పెట్టుకోండి" అని బెడ్డింగు వెదకి, విభూతి ప్యాకెట్టు తీసి ఆయనకిచ్చాను. ఆయన పెట్టుకుని పడుకున్నాడు. ఆ తరువాత మళ్ళీ గురక వినిపించలేదు. గాఢంగా నిద్రపట్టేసింది. ఉదయం నాకు త్వరగా మెలకువ రాలేదు. ప్రక్కబెడ్ ఆయన నిద్రలేపారు. "మీరు రాత్రి ఇచ్చిన విభూతితో నా రోగం మటుమాయమైంది. మీకు చాలా థ్యాంక్స్" అన్నాడు.

నేను కళ్ళు విప్పి ఆయన్ను చూశాను. కడిగిన ముత్యంలా ఉన్నాడు. ఆయన ముఖం ఆనందంతో వెయ్యి వాట్ల బల్బులా వెలిగిపోతోంది. "సార్, నాకెందుకు థ్యాంక్స్! నన్నూ, మిమ్మల్నీ కరుణించిన ఆ సాయి దేవునికి చెప్పండి థ్యాంక్స్" అన్నాను.

ఆయన మధ్యాహ్నం కలసి, స్వామి తనతో మాట్లాడారని, ఇంక ఇంటికి వెళ్ళమని అనుమతిచ్చారని ఎంతో ఆనందంగా చెప్పి సాయంకాలం వెళ్ళిపోయాడు.

అప్పుడు ఆలోచిస్తే స్వామి విసిరిన ఆ మూడో ప్యాకెట్టు ఆ కోయంబత్తూరు ఆయనదని అర్థమైంది. ❋

జ్ఞాపకాల పందిరి

(ధారావాహికం - 17వ భాగం)

ప్రొ॥ కామరాజు అనిల్ కుమార్

మా రెండవ అమ్మాయి అమెరికా వెళ్ళడానికి వీసా కోసం మద్రాసుకు వెళ్ళినప్పుడు అక్కడొక బట్టల షాపుకు వెళ్ళాం. షాపు యజమానితో మాట్లాడుతూ ఉండగా సాధు వాస్వానీ అనే ఒక మహనీయునిగురించిన ప్రస్తావన వచ్చింది. ఆయన మానవతావాదాన్నిగురించి ప్రవచనాలందిస్తూ పూనా కేంద్రంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మహాఋషి అనవచ్చు. సాధు వాస్వానీ ఆరోజున చెన్నైలో ఉన్నారని, సాయంకాలం వారి ప్రసంగం కామరాజు మెమోరియల్ హాలులో ఉంటుందని ఆ షాపు యజమాని చెప్పాడు. కుతూహలం కొద్దీ ప్రసంగానికి వెళ్ళాను. వారి శైలి, హాస్యం, నిరాడంబరత, భక్తితత్పరత నాకు బాగా నచ్చాయి.

అందులో మరచిపోలేని ఒక జోకు మీతో పంచుకుంటాను. ఒక జంట 60వ వార్షికోత్సవం జరుపుకుంటున్నది. విదేశాలలో అది అపురూపంగానే ఉంటుంది. పత్రికా విలేఖరులు ఈ జంటను కలిసి ఇంటర్వ్యూ చేశారు. ఆరు పదుల సుదీర్ఘ కాలం ఎలా కలిసి ఉండగలిగారన్నది వారి సందేహం. సమాధానంగా భర్త, "మేము 60 ఏళ్లు కలిసి ఉన్నామంటే అందుకు ప్రధానంగా ఒక కారణముంది. అన్ని ముఖ్య నిర్ణయాలను నేను తీసుకుంటాను. మిగిలిన చిన్న నిర్ణయాలను నా భార్య తీసుకుంటుంది. ఐతే, నేనింకా ఏ ముఖ్య నిర్ణయమూ తీసుకోలేదు" అన్నాడట. అందరూ నవ్వులలో మునిగిపోయారు.

సరే! సభ ముగిసింది. సాధు వాస్వానీ వేదిక దిగి వెళ్ళిపోతున్నారు. **మా ముందు ఆగి "సాయిరాం" అన్నారు.** ఈలోగా ఎవరో అన్నారు: **"అనిల్ కుమార్ గారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి సన్నిధిలో ఉంటారు. అనిల్ గారు హాస్యచతురులు." దానికి వాస్వానీ గారు స్పందించి, "అలా ఉండకపోతే బాబావారి సన్నిధిలో ఎలా ఉండగలరు?!"** అన్నారు. మరోసారి "సాయిరాం" అంటూ నన్ను ఒకసారి వారి కేంద్రమైన పూనాకు రమ్మని కోరినారు.

శ్రీరామనామ క్షేత్రం అని గుంటూరు అగ్రహారంలో ఉంది. శ్రీ రామకోటి ఉత్సవాలు ప్రతి సంవత్సరం వారం రోజులపాటు జరుపుతారు. శ్రీ రాగం ఆంజనేయులుగారు వ్యవస్థాపక అధ్యక్షులు. విశాలమైన ప్రాంగణంలో ఉపన్యాసాలు, హరికథలు, సంగీత కచేరీలు, అర్ధరాత్రి వరకు కొనసాగుతాయి. రాష్ట్రంలో హేమాహేమీలు, ఉద్దండ పండితులు, సంగీత విద్వాంసులు పాల్గొంటారు. స్వామి కరుణ అన్నట్లుగా ఒక పర్యాయం నన్నుకూడా ఉపన్యసించమన్నారు. **సాకేత రామునిగురించి సాయి రామునికంటె మిన్నగా వివరింపగలవారెవరు?! అది వారి కథయే కదా!** కనుకనే, భగవాన్ బాబావారి రామకథా రసవాహిని, ఆత్మారామమ్‌లను రంగరించి, కలబోసి ఉపన్యసించాను. మంచి స్పందన లభించింది. మరుసటి సంవత్సరం 'శ్రీ సత్యసాయి రామమ్' అనే అంశంపై ప్రసంగించి, అటుపై సాయి భజనలతో సహా ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది.

చెప్పవలసివస్తే - ఏ వేదికనైనా, అవకాశమైనా, సందర్భమైనా... నిర్భయంగా, నేరుగా, సూటిగా స్వామి సందేశం అందించడమే నా ఆశయం. వారి పవిత్ర నామం పదేపదే చెప్తూ, వారి సందేశాన్ని ఉటంకించడంవల్ల, "ఈ అనిల్ కుమార్ శ్రీ సత్యసాయిబాబావారిగురించే ప్రసంగిస్తాడు" అని నేను కోరుకున్న ముద్ర పడిపోయింది. నా ధ్యేయమదే కదా!

స్వామి చిన్మయానంద భగవాన్ సన్నిధిలో ప్రసంగించినవారు. బెంగళూరులో వారు అస్వస్థులుగా ఉన్నప్పుడు భగవాన్ దయతో వెళ్ళి పరామర్శించారుకూడ.

చిన్మయానంద గీతోపన్యాసాలు సుప్రసిద్ధమైనవి. వాటికి నేను వెళ్తూండేవాడిని.

ఒక సంవత్సరం గీతాయజ్ఞ పరిసమాప్తి సందర్భంగా స్వామి చిన్మయానందను నగరమంతా సన్మానించింది. ఆయన వేదికపైన ఉన్నత స్థానంలో కూర్చుని ఉన్నారు. ప్రతి సంస్థవారు ఆయనను పుష్పమాలాలంకృతులను చేస్తున్నారు. శ్రీ సత్యసాయి సంస్థల పక్షాన వారికి పూల మాల వేసే వంతు నాకొచ్చింది. **కూర్చున్న చిన్మయానంద ఒక్క ఉదుటున లేచి, చేతులు జోడించి, "సాయిరాం" అంటూ పూలమాల వేయించుకున్నారు. ఎంతటివారైనా, ఎక్కడివారైనా బాబావారిని దైవంగానే భావించారన్నది నిర్వివాదాంశం.**

తిరుపతి దగ్గర పుదిపుట్ల గ్రామముంది. శ్రీరామకృష్ణ మిషన్ వారి సంస్థ ఉన్నది. రాష్ట్రంలో చురుకైన సంస్థలలో అది ఒకటి. రాష్ట్ర స్థాయి రామకృష్ణ మిషన్ స్వామీజీలు సమావేశమయ్యారు. వేదికపైన కాషాయంబరధారులు ఆసీనులైనారు. మధ్యలో తెల్లని దుస్తులలో కూర్చున్న వాడిని నేనొక్కడినే! అక్కడకూడా భగవాన్ బాబావారిని గురించి ప్రసంగించడం జరిగింది.

మరొక సత్యమున్నది. ఇంట్లో భజనలకు మా క్రిస్టియన్ కాలేజి అధ్యాపకులను ఆహ్వానించేవాడిని. వారు ఆనందంగా పాల్గొనేవారు.

నాటి బ్రహ్మసమాజ ఏకేశ్వరోపాసన, నేటి భగవాన్ ప్రబోధితమైన సర్వధర్మ సమైక్యత నాకు ఆచరణలో, అనుభవంలో కొత్తగా అనిపించలేదు.

ఇదంతా తలచుకుంటే ఒక కలలాగ ఉంది. ఇన్ని సంవత్సరాలిట్టే గడచిపోయినట్లనిపిస్తుంది.

"శివం" ప్రారంభోత్సవం

హైదరాబాదు రాష్ట్రానికి రాజధానియేగాక "శివం", "శ్రీ సత్యసాయి విద్యావిహార్", "శ్రీ సత్యసాయి నిగమాగమం" మొదలైన సంస్థలకు కేంద్రం. ప్రతి సంవత్సరం భగవాన్ ఆ రోజుల్లో సంవత్సరాదినుండి శ్రీరామనవమి వరకు హైదరాబాదులో విడిది చేసేవారు. శ్రీ ఎఱ్ఱమిల్లి సత్యమూర్తిగారు, వారి తండ్రి కృష్ణమూర్తి
4 గారు, ఎన్నో పర్యాయాలు స్వామికి ఆతిథ్యము నిచ్చిన ధన్యజీవులు. డా॥ సూరి భగవంతంగారి కుమారుడు డా॥ బాలకృష్ణగారి ఏర్పాట్లుకూడ సాటిలేనివిగా ఉండేవి. ఈనాటి సీనియర్లందరూ వారివద్ద తర్ఫీదు పొందినవారే! శ్రీ ప్రసాదరావుగారు, డా॥ భగవంతంగారు భగవాన్ వెంట ఉండేవారు. డా॥ దేవులపల్లి పార్థసారథిగారు సేవాదళ్ కన్వీనరుగా ఉండి, ఆ తర్వాత బాబావారి యూనివర్సిటీలో ప్రశాంతి నిలయం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లోను, బృందావన్ కేంపస్ ప్రిన్సిపాల్‌గాను పనిచేశారు. శ్రీ ఆనంద్ ఉచ్చిల్ గారు, శ్రీ మహేశ్వరిగారు, శ్రీ ఈశ్వర ప్రసాద్‌గారు, శ్రీ గోపాలకృష్ణమూర్తిగారు, శ్రీ శ్రీనివాసులుగారు, శ్రీ ముకుందరావుగారు, శ్రీ బి.వి. రమణరావుగారు, శ్రీ రాజా ఉమాపతి రావుగారు, జస్టిస్ ఆంజనేయులుగారు పెద్దలుగా సంస్థలను నడిపించినవారు.

శివం భజన గ్రూపు సుప్రసిద్ధమైనది. శివం సేవాదళ్ చాలా సుశిక్షితులతో, నైపుణ్యం కలవారితో ఏర్పడినది. చండశాసనులై, మిలిటరీని తలపించే రమణరావుగారివద్ద తర్ఫీదు పొందినవారే శ్రీ సత్యనారాయణగారు, శ్రీ రాంబాబుగారు, శ్రీ సాయి, శ్రీ శాస్త్రిగారు, శ్రీ మూర్తిగారు, శ్రీ వేణుగోపాల్‌గారు, శ్రీ రాజయ్యగారు, శ్రీ మల్లికార్జున రావుగారు, శ్రీ సాంబశివరావుగారు, శ్రీ సూర్యనారాయణ గారు, శ్రీ శ్రీశైలంగారు, శ్రీ ఆర్.ఎం. కృష్ణారావుగారు.... ఎంతమందిగురించి చెప్పను?! రాయను?! ఏం చేయను?! ... అన్నట్లుంది నా ప్రస్తుత పరిస్థితి. అందరూ నాయకత్వ లక్షణాలు, అంకిత భావం, క్రమశిక్షణ, భక్తి మెండుగా నున్నవారు.

శివం ప్రారంభోత్సవానికి వెళ్ళే అదృష్టం నాకు కలిగింది. మొదట ప్రొ॥ గోకాక్‌గారు ప్రసంగించారు. ఉత్తర హిందుస్థాన పర్యటన ముగించుకుని వచ్చినట్లుంది. ప్రసంగంలో ఒక మాటన్నారు:

"మేము ఒక స్కూలుకు వెళ్ళాము. పిల్లలు మూడు బటన్లు (గుండీలు) ఉన్న కోట్లు ధరించారు. వాటిపైన ఎస్.ఎస్.బి. అక్షరాలున్నాయి. అంటే సైనిక్ స్కూల్ బాయిస్ అని సంకేతం. కానీ, స్వామి రాకతో ఎస్.ఎస్.బి. అంటే సత్యసాయిబాబాగా మారినట్లుంది."

కరతాళ ధ్వనులు మారుమ్రోగినవి.



ఇక స్వామివారి దివ్యోపన్యాసం ఖంగ్ ఖంగ్ మంటూ కంచు కంఠంతో సాగింది:

"శివం అనగా మంగళం. శంకర అనగా శుభములను కలిగించువాడు. రామ, కృష్ణాది అవతారమూర్తుల పవిత్ర నామములకు ముందు శ్రీకారముంటుంది. వారు దేహధారులు. అందువలన శ్రీరామ, శ్రీకృష్ణ అంటాము. కానీ, శ్రీ శివ, శ్రీ శంకర, అని ఎవరూ సంబోధించరు. కోరికలను జయించటంచేత శివుడు కామహారి అయినాడు. ఆ కారణంచేతనే మృత్యువును జయించి మృత్యుంజయుడైనాడు. దిక్కులను అంబరములుగా గలిగినవాడు కనుక దిగంబరుడైనాడు." ఈవిధంగా సాగిన శ్రీవారి దివ్య ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

ఆ తరువాత నేను అనేక పర్యాయాలు శివంకు వెళ్ళడం జరిగింది. మహాభక్తుల పరిచయమయింది. వారికి సన్నిహితుడను కాగలిగాను. శివం సేవాదళ్ ప్రతి వేసవిలోను బెంగళూరులోని వైట్‌ఫీల్డు స్వామి కాలేజిలో జరిగిన సమ్మర్ క్లాసులలో సేవలందించేవారు.

శ్రీ రమణరావుగారికి పిసరంత అధికంగా హైదరాబాద్ సేవాదళంపై ప్రేమ అని చెప్పుకునేవారు. సేవాదళంవారికి ప్రేమ, ఐకమత్యం, క్రమశిక్షణ అన్నింటిని నేర్పింది రమణరావుగారే! ఆయనకు వారిపై ప్రేమ, వారందరికి వీరిపై వీరాభిమానం నేటికీ చెక్కుచెదరలేదు. తాను స్టేట్ ప్రెసిడెంటైనా రమణరావుగారు సేవాదళం స్కార్ఫ్ వేసుకుని ముందుండేవారు. సేవాదళంపై మాటపడనిచ్చేవారు కాదు. ఎవర్ని ప్రశ్నించినా ఆయన అభిమానాన్ని ఎలా చూరగొన్నారో, ఆయన ఆదరం ఎలాంటిదో కథలు కథలుగా చెప్తారు.

స్వామి మనవారిపై ఏ కొంత కోపం ప్రదర్శించినా సర్దిచెప్పేవారు రమణరావుగారు. వరల్డ్ కౌన్సిల్ మీటింగుకి ఓ పెద్దమనిషి వచ్చాడు. వారి రాకపట్ల స్వామి అసంతృప్తిగా ఉన్నారు. నేను స్టేట్ ప్రెసిడెంట్‌ని. నన్ను పిలిచి స్వామి గట్టిగా మందలించారు. "స్వామీ! వచ్చినాయనకీ, ఈ అనిల్ కుమార్‌కీ సంబంధంలేదు. అనిల్ కుమార్ బాధ్యుడు కాదు" అంటూ నన్ను వెనకేసుకొచ్చి రక్షించాడాయన.

బెల్లంపల్లి అనుకుంటాను. శ్రీరంగనాథంగారని చాల పెద్ద ఆఫీసర్. సేవకై పర్తికి వచ్చారు. పూర్ణచంద్రలో డ్యూటీ వేశాము. ఆయనకు కుటుంబరావుగారు తెలియదు. ఏ కారణంచేతనో నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. ఇదంతా నా నెత్తిన పడింది. అర్జంటుగా డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ల మీటింగ్ పెట్టమన్నారు. నన్ను ముద్దాయిని చేశారు కుటుంబరావుగారు. ముక్తాయింపుగా రమణరావుగారు మాట్లాడారు. "అయ్యా! కొత్తగా వచ్చినవారికి మీరెవరో తెలియదు కదా! అందువల్ల దీనిలో ఎవరి దోషమూ లేదు. ఇక ముందు ఇలాంటివి జరుగకుండా చూచుకుంటాము" అన్నారు.

నాకిప్పుడు జ్ఞాపకం వస్తోంది. హిల్‌వ్యూ స్టేడియంలో నన్ను మరికొందరితోపాటు కొత్తగా నియమింపబడిన స్టేట్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. సభ తరువాత నన్ను వెంటబెట్టుకొని రమణరావుగారు ఇందులాల్ షాగారిని కలసి, "సార్! ఎంత పని చేశారండీ! అనిల్ కుమార్ స్టేట్ అంతా తిరగడం సాధ్యమా! వ్యయప్రయాసలతో కూడిన పని. పైగా పెద్ద సంసారం. బాధ్యతలు అధికం. కాలేజి లెక్చరర్ ఆయన. స్టేట్ ఆఫీస్ సర్క్యులర్లు తపాల, రవాణా కుదరని పని" అన్నారు. దానికా పెద్దాయన, **"అదేమిటి రమణరావు? నేనా చేసింది! ఈ ఉదయమే స్వామిని కలిశాను. వారే అనిల్ కుమార్ పేరు ఆంధ్రప్రదేశ్ ఎదురుగా వ్రాశారు.** నేనేం చేసేది? మీరంతా ఉన్నారు కదా! సహకరించండి" అని సలహా యిచ్చారు.

మధ్యాహ్నం జిల్లా ప్రెసిడెంట్‌ల మీటింగ్ పెట్టి నా నియామక విషయాన్ని ప్రకటించి, ఆయనే తేనేటి విందు ఏర్పాటుచేసి నాకు అందరూ సహకారమందించాలని మిలిటరీ పద్ధతిలో హుకుం జారీ చేశారు రమణరావుగారు. నాతో, "ఈ సాయంకాలం హిల్‌వ్యూ స్టేడియంలో ప్రోగ్రాముంది. ముందుకు వెళ్ళి స్వామికి నమస్కరించి ఆశీస్సులందుకో!" అని చెప్పి స్వయంగా వెంటబెట్టుకొని నన్ను స్వామి పాదాలదాక తీసికెళ్ళారాయన.

ఓసారి రమణరావుగారిని ఇంటర్వ్యూకి పిలిచారు స్వామి. తాము ఆశించినంత స్థాయిలో వేగంగా సేవా కార్యక్రమాలు జరగటం లేదని గద్దించారు, గట్టిగా మందలించారుకూడ. ఫలానా జిల్లా అధ్యక్షుడు సరిగా పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "అతనిని మార్చేద్దాం" అన్నారు స్వామి. రమణరావుగారు, "స్వామీ! ఈమాటుకు క్షమించండి. అతనికి నే చెప్తాను" అంటూ తన పెద్ద అరచేతులతో స్వామి పాదాలను గట్టిగా పట్టుకున్నారు.

జాతీయ స్థాయిలో సేవాదళ్ సభలు జరిగినాయి. రమణరావుగారప్పుడు స్టేట్ ప్రెసిడెంట్. నేను వైస్ ప్రెసిడెంట్‌గా ఉండేవాడిని. కొన్ని అనివార్య కారణాలవల్ల, ఈ కార్యక్రమాలకు ఆయన మొదటినుంచి పాల్గొనలేక పోయారు. నేనే ఇన్‌ఛార్జ్‌గా ఉండవలసివచ్చింది. **గ్రామసేవల ప్రారంభం ఆనాడే జరిగింది. లారీలు ఏర్పాటుచేసి, ప్రతి లారీలోను రాష్ట్రాలవారిని గ్రూపులుగా పంపి వైద్యసేవలందించడం జరిగింది. బాబావారు స్వయంగా విచ్చేసి లారీలకు జెండా ఊపి ప్రారంభించారు. వెయ్యిమందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రూపొందించి గ్రామసేవలకు అంకురార్పణ జాతీయ స్థాయిలో గావించింది ఆంధ్రప్రదేశ్ సంస్థలే!**

ఈసందర్భంగా తరచు వరల్డ్ కౌన్సిల్ సమావేశాలు జరిగేవి. నా వెంట ప్రతి మీటింగ్‌కు ఆనంద్ ఉచ్చిల్, శ్రీనివాసులు, ముకుందరావు, మహేశ్వరిగార్లను తీసుకెళ్ళే వాడిని. ఒక్కొక్క రాష్ట్రానికి ఆయా రాష్ట్రాల అధ్యక్షులు ప్రతినిధులైతే మన రాష్ట్రం తరఫున పంచపాండవులలాగ మేము కలసివెళ్ళేవాళ్ళం. మేము కలసి ప్లానువేసి అన్ని కార్యక్రమాలను రూపొందించేవారము. క్యాడర్లు, హోదాలు, స్వార్థం, ఎలాంటి కాంప్లెక్సులూ లేని సోదర ప్రేమ ఉండేది ఆ రోజుల్లో. అనంతపురం జిల్లా అంతటా బోర్‌వెల్స్ వేయించింది ఆ సంవత్సరంలోనే!

డా॥ నరసింగరావుగారు, డా॥ తిలక్‌గారు వైద్య శిబిరాలను నిర్వహించేవారు. దేశస్థాయిలో వైద్యులను సమీకరించారు. ఔషధాలను సేకరించారు. వారు రాష్ట్ర వైద్య విభాగానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఉండేవారు. ఎంత ప్రేమ, ఎంత అభిమానం, ఎంతటి ఐకమత్యమో మాటలలో చెప్పలేను. డా॥ జె.వి.సుబ్బారావుగారు తిరుపతి వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్, రాష్ట్ర సేవాదళ్ కన్వీనర్. రిటైరైనా చాలా చలాకీగా ఉండేవారు. 24 గంటలు చాలవన్నట్లు పనిచేసేవారు, చేయించేవారు.

హైదరాబాదులో బి.వి.ఎల్. నరసింహారావు, అగ్రికల్చర్ ఇంజనీర్ ఉండేవారు. ఎందరెందరికో వేదమంత్రాలు నేర్పారాయన. శివంకు ఒక స్థాయి ఉన్నది. ఒక ప్రత్యేకత ఉన్నది. ఒక బ్రాండ్ ఉన్నది. నగరమంతా సంస్థలున్నాయి. భక్తులున్నారు. సేవాదళం చెప్పుకో దగినది. అయితే ప్రత్యేకత ఎక్కడుందంటే ఆప్యాయత, నిరాడంబరత, స్నేహం అన్నీ ఆటోమేటిక్‌గా సాగిపోతాయి. ఆజమాయిషీ ఉండదు. దేశంలోని ప్రధాన సాయి కేంద్రాలలో ఒకటిగా – 'సత్యం' (ముంబై), 'సుందరం' (చెన్నై)ల మధ్య 'శివం' ఉండటం అదృష్టం.

(సశేషం)

సనాతన సారథి వెబ్‌సైట్

చందాదారులు తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడానికి మరియూ క్రొత్త చందాలు చెల్లించడానికి సనాతన సారథి వెబ్‌సైట్ **[www.sanathanasarathi.org]** వీలుకల్పిస్తున్నది. అంతేగాక, ప్రతి నెలా సనాతన సారథి ఇంగ్లీషు, తెలుగు ఎలక్ట్రానిక్ కాపీలను ఈ వెబ్‌సైటు చందాదారులకు అందుబాటులోకి తెస్తున్నది.

– కన్వీనర్

ప్రతిష్ఠాత్మక పుస్తక ప్రదర్శన



భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యసందేశ వ్యాప్తికై శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ వారు చేస్తున్న అవిరళ కృషి అద్వితీయం, అత్యంత శ్లాఘనీయం. అందుకు నిదర్శనం ఇటీవల హైదరాబాదులో జరిగిన వార్షిక పుస్తక మేళాలో ఆధ్యాత్మిక విభాగంలో శ్రీ సత్యసాయి బుక్ స్టాల్ అత్యుత్తమ స్టాల్‌గా ఎంపిక కావడం.

2012 డిసెంబరు 14వ తేదీనుంచి 25వ తేదీవరకు నిర్వహించిన 27వ జాతీయ వార్షిక హైదరాబాదు పుస్తక మేళా సందర్శించడానికి పుస్తకప్రియులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. ఈ పుస్తక మేళాలోని 280 స్టాల్స్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి గురించిన పుస్తకాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పుస్తకశాల సందర్శకులను విశేషంగా ఆకర్షించింది.

సాయి సాహిత్యంతోపాటు ఆ పుస్తక శాలలో నిరంతరం ప్రదర్శించిన స్వామి వీడియోకు సందర్శకులనుంచి విశేషమైన స్పందన లభించింది. పుష్పమాలలతో అలంకరించిన భగవాన్ దివ్య చిత్రపటాలతో... అగరువత్తుల ధూపం, విభూతి పరిమళాలు కలగలసి స్టాల్‌లో పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. 'సాయిరాం' అంటూ చిరునవ్వుతో స్వాగతిస్తూ, పుస్తకాల ఎంపికలో క్రమశిక్షణతో, అంకిత భావంతో సేవాదళ్ సభ్యులు అందించిన తోడ్పాటుకు సందర్శకులు ఎంతో సంతృప్తి చెందారు.

శ్రీరామకృష్ణ పబ్లికేషన్స్, ఇస్కాన్, భవాన్స్ జర్నల్ ఆఫ్ ముంబై తదితర సుప్రసిద్ధ ప్రచురణల విభాగాలతో కూడిన ఆధ్యాత్మిక పుస్తకాల స్టాల్స్‌లో, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ (ఆం.ప్ర.) స్టాల్ భగవాన్ ఆశీస్సులతో ఉత్తమ స్టాల్‌గా ఎంపిక అయింది.

పుస్తకాలు అమర్చి ప్రదర్శించిన తీరు, సేవాదళ్ సభ్యులు సందర్శకులను ఆదరించిన తీరు, సంతృప్తి చెందిన సందర్శకుల సంఖ్య ప్రాతిపదికగా నిర్వాహకులు ఈ స్టాల్‌ను ఉత్తమ స్టాల్‌గా ఎంపిక చేశారు.

చురుకైన సేవాదళ్ సభ్యుల చొరవతో, కొనుగోలు చేసిన పుస్తకాలను నేరుగా ఇంటికి పంపించే సదుపాయం కలిగించడంవలన సందర్శకులు రికార్డు సంఖ్యలో పుస్తకాలను కొనుగోలు చేశారు.

ఎస్.జి. చలం

రాష్ట్ర సాయిసంస్థల అధ్యక్షులు

మహో మహిమాన్విత ప్రేమావతారి

(ధారావాహికం - 22వ భాగం)

బి.వి. రమణరావు

శిరిడీ సాయి పాద ముద్రలు

1948 ముందు మద్రాసులో లోకనాథ ముదలియార్ మంచం ప్రక్కన ప్రత్యక్షమై భగవాన్, అతని తీవ్రమైన మానసిక వ్యాధిని కుదిర్చేరు. స్వామియెడల భక్తితో స్వామి పాదములు పట్టుకొని, "మీరు సాక్షాత్ భగవత్ స్వరూపులు. నేను తమ శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఒక ఆలయమును నిర్మిస్తాను" అన్నాడు. తర్వాత స్వామి అతనికి స్వప్నములో కనబడి, ఆలయం నిర్మించి అందు తమ పూర్వావతారమైన శిరిడీ బాబా విగ్రహమును ప్రతిష్ఠించమన్నారు. ముదలియార్ అనిశ్చితిని గ్రహించి, ఆ విషయమును పునరుద్ఘాటిస్తూ స్వామి అతనికి జాబు రాసిరి. ఆలయ నిర్మాణమయిన తర్వాత 1948లో స్వామి స్వయముగా శిరిడీ సాయి విగ్రహమును అందు ప్రతిష్ఠించేరు.

ప్రతిష్ఠించిననాడు ముదలియార్ కుటుంబ సభ్యులందరూ వచ్చి స్వామిని ప్రార్థించి, వారి గృహమునకు తోడ్కొనిపోయి, స్వామికి పాదపూజ చేసి, పాదముద్రలను ప్రసాదించమని ప్రార్థించారు. తెల్లని పట్టువస్త్రముపై పసుపు, చందనము పూసిన పాదపద్మములతో స్వామి నిలబడిన తర్వాత, ఆ వస్త్రమును తీసి చూడగా దానిపైన స్వామియొక్క సుకుమార పాదముద్రలు కాకుండా, వెడల్పు పొడవు అయిన శిరిడీ సాయి పాదముద్రలు పడినవి.

డాక్టర్ ప్రార్థన విని...

1971లో శ్రీ జె.ఎమ్. పటేల్ టాంజానియాలోని అరుషా పట్టణంలో తీవ్రమైన వ్యాధితో హాస్పిటల్లో ఉన్నాడు. గుండె నిలిచిపోయి డాక్టర్లు కూడా ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉండగా, స్వామి భక్తుడైన డా॥ సి.జె. గాధియా అతని వద్దనున్న స్వామి విభూతిని ఛాతీమీద రుద్దగా గుండె కొట్టుకోవడం మొదలెట్టింది. అతడు కోలుకొని ఆరు నెలల తర్వాత పుట్టపర్తి వెళ్లగా స్వామి అతనితో, "సరియైన టైమ్‌లో నీకు వైద్యం చేసిన డాక్టరు ప్రార్థన చేశాడు కనుక నీకు పునర్జన్మ ప్రాప్తించింది" అన్నారు.

స్ప్రింగ్ విరిగిన కారులో...

1971లో గోవా ముఖ్యపట్టణమైన పానాజిలో ప్రభుత్వ సచివాలయం పైఅంతస్తులో ఉన్న వివేకానంద హాల్లో స్వామి ప్రసంగించుటకు సభ ఏర్పాటు చేశారు. బెల్గాం నుండి కారులో డాక్టర్ అడికె ఆ సభకు తీసుకొస్తున్నారు. త్రోవలో ఆ ఫియట్ కారు స్ప్రింగు విరిగిపోయింది. డాక్టర్ అడికె భగవాన్‌తో, "ఈ కారు ఇక్కడ విడిచిపెట్టి వెనుక వస్తున్న కార్లలో దేనిలోనైనా వెడదాం స్వామీ!" అని ప్రతిపాదించేడు. "కారు ఇలా మధ్యలో ఆపితే బాగుండదు. పోనియ్యి. ఇందులోనే వెడదాం" అన్నారు, స్వామి.

"స్వామితో ఆ బ్రహ్మాండమైన మీటింగుకి వెళ్లేను. రెడ్ కార్పెట్ మీద నడుస్తూ సభా వేదికమీదకు వెడుతుండగా ఒక క్రిస్టియన్‌కు క్రీస్తు బొమ్మ ఉన్న లాకెట్‌ని సృష్టించి ప్రసాదించేరు. తిరిగి వచ్చేటప్పుడు మరో కారులో వెడదాం అంటే, "వద్దు, నీ ఫియట్‌లోనే వెడదాం" అన్నారు స్వామి. గోవా నుండి బెల్గాంకి వచ్చే దారిపొడవునా, సరియైన రోడ్డు లేని దట్టమైన అడవి, కొండ గుట్టలూ, వర్షముచేత పడిన గండ్లూ... ఆ దుర్గమమైన మార్గం గుండా ఆ రాత్రి బెల్గాం ఎలా చేరామో తెలీదు. అంతా స్వామి మహిమ" అన్నారు డాక్టర్ అడికె.

భగవాన్ దివ్యచరిత్ర చదివో, వినో, కుతూహలంతోనో, భక్తితోనో స్వామిని దర్శించి, వారి ప్రబోధలు వినడంవల్ల – "దిక్కు తెలియని మా బ్రతుకులకు, మా వ్యధిత

హృదయాలకు వెలుగు లభించింది. జీవిత పరమావధి గ్రహించేం. స్వామియొక్క అనుగ్రహ శక్తి అడుగడుక్కీ మమ్మల్ని ముందుకు నెట్టుతూండగా, మా జీవితాలు అర్థవంతమై శాంతిని పుంజుకుంటున్నాయి. ఆజన్మాంతం శ్రీ సత్యసాయిబాబావారికి మా కృతజ్ఞతాభివందనములు. మళ్ళీమళ్ళీ స్వామిని దర్శించుకునే అవకాశం ప్రసాదించ మనే మా ప్రార్థనలను స్వామికి అందించి ఆశీర్వదించమని ప్రార్థించండి" అనే భావాన్ని వ్యక్తం చేస్తూ ఆర్తితో, జిజ్ఞాసతో జాబులు రాసినవాళ్ళల్లో కొందరు ప్రముఖులు – హాలీవుడ్‌లోనూ, న్యూయార్క్‌లోనూ సినిమా, నాటక రచయితగా పేరు పొందిన ఆర్నాల్డ్ షుల్‌మన్; లాస్ ఏంజెలెస్‌లోని ఈస్ట్ వెస్ట్ కల్చరల్ సెంటర్‌కి చెందిన జూడిత్.ఎం.ట్రైబర్గ్; శాంతాబార్బరానుండి జాన్‌ఎవర్‌సోల్; న్యూయార్క్‌నుండి హిల్డా ఛార్లటన్; ఫ్రాన్స్‌కు చెందిన డయానా మెర్కియర్; నార్వే దేశస్థుడైన ఆల్ఫ్ టిడ్‌మన్ జాన్సన్; న్యూయార్క్ వాస్తవ్యుడు జాన్ ముఫెట్; మైఖెల్ సుల్జ్, ఎడ్డీ ఫూయర్; ఫ్రాంక్‌ఫర్డ్ వాస్తవ్యురాలు గేబ్రియాలా స్టేయర్; మైఖెల్ మెల్విన్; కెనడాకు చెందిన కెర్రీ, జానెట్ మొదలైనవారు. వీరందరూ 1970–71లో శ్రీ కస్తూరి గారికి జాబులు రాసినవారు.

స్వామి గ్రేటెస్ట్ మిరకిల్

బాబాయొక్క అనంత కరుణను చవిచూసినవారిలో ఒకరైన సుప్రసిద్ధ రంగస్థల నటి అయిన జెర్రీ కథనం విందాం: *"ఒక సంవత్సరంనుండి బాబా సన్నిధానంలో ఉంటున్నాను. బాబావద్దకు వచ్చే రోగగ్రస్తులు, వ్యధిత హృదయులు, ఎందరో ఉంటారు. బాబావారిని దర్శించేక భక్తివిశ్వాసములతో, సంతోష సంతృప్తులతో, మనశ్శాంతితో తిరిగి వెడతారు. నా సంస్కారములోని లోపములు అద్దములోవలె కళ్ళకుకట్టినట్లు కనబడ్డాయి. ఆత్మపరిశీలన ద్వారా ప్రాపంచిక కోరికలపట్ల విరక్తి కలిగి మనస్సులో ప్రశాంతత నెలకొంది. బాబా కరుణవల్ల జీవితాంతం ఈ శాంతి సుస్థిరమవుతుందని, ఎక్కడున్నా స్వామి అనుగ్రహం నన్ను వెన్నంటి ఉంటుందని ప్రబలమైన విశ్వాసం కలిగింది. నావంటి వేలాదిమందిలో మానసిక పరివర్తన తీసుకు రావడమే స్వామి గ్రేటెస్ట్ మిరకిల్."*

టెలిఫోన్‌లో విభూతి

పూర్ణయ్యగారు ఛీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్ ఆఫ్ సదరన్ రైల్వేస్. ఆయన భార్య శ్రీమతి నాగమణి విద్యావంతురాలు, రచయిత్రి. ఆ దంపతులు పాతమందిరం రోజులనుండి స్వామి భక్తులు.

1944లో బెంగళూరులో తమ స్వంత ఇంట్లో నాగమణమ్మ వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో చేసుకుంది. స్వామికి అప్పుడు నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. పూజలైనా, వ్రతాలైనా, పర్వదినాలైనా ... పుట్టపర్తిలో స్వామి ఆధ్వర్యంలో వారు అలంకారాలు మొదలు భజనలు, పాటలు, ప్రసాదాలు స్వయంగా పర్యవేక్షిస్తుండగా జరిగే ఉత్సవాలలో భక్తుల ఆనందానికి అవధులుండవు.

ఆ వరలక్ష్మీ వ్రతం రోజున స్వామి మద్రాసులో ఉన్నారు. వారితోబాటు పూర్ణయ్యగారు కూడా అక్కడే ఉన్నారు. ప్రత్యక్షంగా స్వామి దివ్య సన్నిధిలో ఈ వ్రతం చేసుకునే అదృష్టం లేకపోయింది కదా అన్న ఆలోచన రాగానే నాగమణిగారికి కొంత ఉత్సాహ భంగం అయింది.

ఇంతలోనే బయట కారు ఆగింది. స్వామి స్వయంగా లోపలికొచ్చేరు. ఇంక ఆమె ఆనందానికి పట్టపగ్గాలు లేవు. స్వామికి పాదపూజ చేసింది. ఫలహారం కూడా కొంచెం తీసుకున్నారు. చేతులు కడుగుకునేటందుకు నీళ్ళు, బేసిన్, నేప్‌కిన్‌లు తీసుకురావడానికి లోపలికెళ్ళి అవి తెచ్చేటప్పటికి స్వామి హడావుడిగా వెళ్ళిపోయేరన్నారు అక్కడున్నవాళ్ళు.

ఆమె ఆశ్చర్యపోయి బయటికొచ్చి అక్కడున్న నౌకరుతో, "స్వామి కారు ఎటు వెళ్ళింది?" అని అడిగింది.

అతడు, "స్వామేమిటి! కారేమిటి! ఎవరూ రాలేదమ్మా. నేనిక్కడే ఉన్నాను" అన్నాడు.

"నా కళ్ళముందు కారాగింది. స్వామి దిగి లోపలికొచ్చి పూజ అయిన తర్వాత ఫలహారం చేసేరు. అసలు స్వామే రాలేదు, కారే రాలేదు అంటావా?!" అంటూ అతణ్ని తిట్టి వెంటనే టెలిఫోన్ అందుకుని డాక్టర్ పద్మనాభం గారింటికి, వెంకటగిరి రాజాగారింటికి, గోగినేని వేంకటేశ్వర్రావు గారింటికి ఫోను చేసింది. ఆరోజుల్లో ఫోన్ కనెక్షన్లు చాలాతక్కువమంది ఇళ్ళల్లో ఉండేవి.

అందరుకూడా, "స్వామి బెంగళూరొస్తే మాకు తెలియదా! మీ ఇంటికి వచ్చేరంటున్నారు. మరి మీకే తెలియాలి ఎక్కడికెళ్ళారో" అన్నవాళ్లే. తను తప్ప అక్కడ స్వామిని చూసినవాళ్ళెవరూ ఉన్నట్లు లేదు. స్వామి ఫలహారం చేసిన ప్లేటుకూడా అక్కడ ఉంది.

వెంటనే ఆమె మద్రాసు వెంకటమునిగారింటికి ఫోను చేసింది. స్వామే స్వయంగా ఫోను అందుకుని ఆమెను పలకరించేరు. ఈ హఠాత్పరిణామానికి ఆమె తెలివితప్పి పడిపోయింది. ఇంతలో అక్కడున్న భక్తులు ఆ ఫోన్‌లో, "స్వామీ, నాగమణమ్మ మూర్ఛపోయింది" అని జరిగింది చెప్పేరు. వెంటనే స్వామి, "ఇదిగో, టెలిఫోన్‌లో విభూతి పంపుతున్నాను. అది ఆమెకి పెట్టి కొంచెం మంచి నీళ్ళివ్వండి" అని చెప్పేరు. టెలిఫోన్ రిసీవర్‌లోనుంచి గుప్పుగుప్పున విభూతి టేబుల్ మీద పడింది. దాన్ని తీసి ఆమెకు కొంచెం పెట్టగానే తేరుకుని, స్వామి లీలకు చేతులు జోడించి నమస్కరించింది. అద్భుతమైన ఈ స్వామి లీల సంచలనం సృష్టించింది.

ఉల్ఫ్ గ్రెగరీవిచ్ మెస్సింగ్

1899లో పోలెండ్‌లో జన్మించిన ఉల్ఫ్ గ్రెగరీవిచ్ మెస్సింగ్ అనేక సాధనలు చేసి ఆధ్యాత్మిక పరిణతి చెంది అనేక అతీంద్రియ శక్తులు సంపాదించిన వ్యక్తి. ప్రచండ శక్తితో ప్రపంచాన్ని గడగడలాడించిన హిట్లర్‌యొక్క పతనాన్ని దివ్యదృష్టితో గ్రహించి ప్రకటించినందువల్ల, ఇతనిని పట్టుకుని అప్పగించినవాళ్లకు మిలియన్ డాలర్ల బహుమానాన్ని ప్రకటించేడు హిట్లర్. అందుచేత ఇతను 1937 నుంచి అజ్ఞాతంగా ప్రపంచమంతా పర్యటిస్తూ తలదాచుకున్నాడు.

ఒకసారి ఇతని అతీంద్రియ శక్తులపట్ల అవిశ్వాసం, కుతూహలం వ్యక్తపరచిన స్టాలిన్‌తో, "నిన్ను రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకి నీ ఆఫీసులో కలుసుకుని కరచాలనం చేస్తాను" అని ఛాలెంజ్ చేశాడు, మెస్సింగ్. ఆరోజున స్టాలిన్ తన ఆఫీసు చుట్టూ మిలిటరీ ఉద్యోగులను కాపలా పెట్టేడు. సరిగ్గా 12 గంటలకి ఉల్ఫ్ మెస్సింగ్ స్టాలిన్ గదిలో ప్రవేశించి, స్టాలిన్‌తో కరచాలనం చేశాడు.



"ఇదిగో, టెలిఫోన్‌లో విభూతి పంపుతున్నాను"

నిర్ఘాంతపోయిన స్టాలిన్ లోపలికి ఎలా రాగలిగావని అడిగితే చిరునవ్వుతో, "నీ రూపంలోనే వచ్చాను" అంటాడు. మెస్సింగ్ మహాత్మా గాంధీ, సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌లను, ఇంకా అనేకమంది యోగీశ్వరులను సందర్శించేడు.

భగవాన్ తన సంకల్పానుసారం తోటి విద్యార్థులతో ఒకసారి 1937లో కమలాపురం రైల్వే స్టేషన్‌కి షికారుగా వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన గురించి వారే స్వయంగా చెప్పారు. "రైలు దిగిన ఒక పాశ్చాత్య సన్యాసి నన్ను చూసి పరుగుపరుగున వచ్చి, నన్ను కౌగలించుకొని ముద్దు పెట్టుకుని, "ఐ లవ్ యూ, ఐ లవ్ యూ' అంటూ నా చుట్టూ తిరుగుతూ నాట్యం చెయ్యడం చూసి, నా స్నేహితులు నన్ను ఎత్తుకుపోతాడేమో ఈ బైరాగి అని అక్కడినుండి తీసుకుపోయేరు. అతను ఉల్ఫ్ మెస్సింగ్. అతడెవరో బయటపడితే అతడికి ప్రాణాపాయం. అతనికేసి చూసి ఒక చిరునవ్వు నవ్వి వెళ్లిపోయేను."

అతడు హిట్లర్ మరణానంతరం తిరిగి పోలెండ్ వెళ్ళి తన 75వ యేట అనాయాస మరణం పొందేడు. 22.11.1980 తేదీన ప్రశాంతి నిలయంలో ఎందరో

విదేశీయులు కూడా ఉన్న సభలో సందర్భ వశమున స్వామి వెల్లడించేరు.

శివ శక్తి స్వరూప నిరూపణ

1963 జూన్ 28వ తేదీ భగవానుని దివ్య చరిత్రలో భక్తులకు మరపురాని అద్భుత ఘట్టము. ఆనాడు సాయంత్రం ప్రశాంతి నిలయంలో భగవాన్ ఆదేశానుసారం, "నేటినుండి వారం రోజుల వరకు భగవాన్ భక్తులకు దర్శనమివ్వరు" అని ప్రకటన చేశారు. 29వ తేదీ శనివారం ఉదయం, కస్తూరిగారు ప్రక్కనే ఉండగా స్వామి హఠాత్తుగా క్రిందపడిపోయారు. స్వామియొక్క ఎడమ పార్శ్వమునకు పక్షవాతము వచ్చింది. నాటినుంచి శరీరములో అనూహ్యమైన, వికృతమైన మార్పులు కనిపించినాయి. ఎడమచెయ్యి, ఎడమకాలు కొయ్యబారిపోయినవి. రోజులు గడుస్తున్నకొద్దీ ఎడమ కన్ను, ఎడమ దౌడ, నాలుక చలనములేక బిగుసుకు పోయినాయి. ప్రశాంతి నిలయమంతా భయాందోళనలతో నిండిన వాతావరణము క్రమ్ముకున్నది.

కస్తూరి, రాజారెడ్డిగార్లు స్వామి ప్రక్కనే ఉండి, క్షణ క్షణమూ క్షీణిస్తున్న బాబావారి దేహస్థితిని నిస్సహాయంగా గమనిస్తూ ఉన్నారు. ఒక డాక్టరు స్వామిని పరీక్ష చేసి, "ఇది కోమాలోనికి పోవుటకు ప్రథమ లక్షణము" అన్నాడు. పలువురు డాక్టర్లు పరీక్షించి, "ఇది ట్యూబర్క్యులర్ మెనింజైటిస్" అని దానికవసరమైన ఇంజెక్షన్లు ఇవ్వబోగా స్వామి వారించినారు. ఆ స్థితి చూసి చుట్టూ ఉన్నవారు భోరున విలపిస్తుండగా, బుధవారంనాటికి వ్యాధి తగ్గునని స్వామి సంజ్ఞ చేస్తూ వారిని ఊరడించడానికి ప్రయత్నించారు. ఆ పరిస్థితిలో ఎవరు మాత్రం ఏమి చేయగలరు?! వ్యాధిని తగ్గించుకొమ్మని స్వామినే ప్రార్థించసాగినారు. రోజురోజుకూ క్షీణిస్తున్న భగవాన్ ఆరోగ్యమును ఆరు రోజులుగా చూస్తున్న భక్తులు దుఃఖ సముద్రంలో మునిగినారు.

గురువారం స్వామి కస్తూరిగారితో అతి కష్టంమీద మాట్లాడుతూ శనివారం గురుపూర్ణిమనాడు స్వామి భక్తులకు తప్పక దర్శనం ఇస్తారని ప్రకటన చేయించారు. శనివారం ఉదయం మిద్దెపైనుండి జాగ్రత్తగా భక్తులు బాబాను చేతులమీదుగా మోసుకువచ్చి, ద్వారములకడ స్వామి ఎడమకాలును, చేతిని జాగ్రత్తగా పట్టుకుని మందిరంలోకి ప్రవేశించి సింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామి మంచినీరు తెమ్మని సంజ్ఞ చేశారు. వెండి గ్లాసుతో నీరు తీసుకొనిరాగా స్వామి కుడి చేతి వ్రేళ్ళను ఆ నీట ముంచి, ఆ నీటి బిందువులను ఎడమ చెయ్యి, ఎడమ కాలుపై చల్లి నెమ్మదిగా నిమిరారు. అంతే, వారి శరీరం వారి అధీనంలోకి వచ్చింది. తక్షణమే లేచి నిల్చుని, మైకులో **'ప్రేమస్వరూపులారా!'** అని తమ దివ్యకంఠ స్వరముతో భక్తులను సంబోధించగా, దిక్కులు పిక్కటిల్లే కరతాళ ధ్వనులతో ఆనందాశ్రువులతో భక్తులు తమ కళ్ళను, చెవులను తామే నమ్మలేని స్థితిలో ఉండినారు.

పూర్వము భారద్వాజ మహర్షికి తామిచ్చిన వరము ననుసరించి, ఈ వ్యాధిని, ఈ బాధను తమపై తామే సృష్టించుకున్న కారణమును వివరముగా చెప్పి భక్తులకు సాంత్వన చేకూర్చినారు. ఒకానొక సందర్భంలో శక్తి (పార్వతి) తనను యజ్ఞమునకు ఆహ్వానించడానికై కైలాసానికి విచ్చేసిన భారద్వాజ మహర్షిని అశ్రద్ధ చేసిన కారణంగా ఆయన ఎనిమిది దినములు పక్షవాతముతో బాధపడవలసి వచ్చిందనీ, అప్పుడు శివుడు మహర్షిపై నీళ్ళు ప్రోక్షించి స్వస్థత చేకూర్చి, "మేము మీ వంశమున కలియుగములో మూడు అవతారములుగా జన్మిస్తామ"ని వరమిచ్చాడని వెల్లడించారు. "భారద్వాజ గోత్రంలో వచ్చిన శిర్డీ సాయిబాబా, శివుని అవతారం. అదే గోత్రములో వచ్చిన ఈ రూపమే రెండవది. ఇది శివ, శక్తి స్వరూపము. ఇంక, రాబోయేదే శక్తి రూపం. మరొక విషయం; 'మేమిద్దరం చేరి నీ వంశములో పుట్టినప్పుడు శక్తియొక్క అశ్రద్ధవల్ల నీకిపుడు 8 దినములు కలిగించిన బాధను శక్తి (అంటే, ఈ దేహముయొక్క ఎడమప్రక్క) అనుభవిస్తుంది. ఎనిమిది దినములైన తరువాత శివుడు (అంటే కుడి ప్రక్క) నీళ్లు ప్రోక్షించి దానిని సంపూర్ణ నివారణ చేస్తాడు' అని శివుడు ఆ మునికి వరమిచ్చాడు. ఇపుడు ఈ జబ్బు వచ్చి ఎనిమిది దినములయినవి. ఆనాటి సంకల్ప ప్రకారమే అన్నీ జరిగినాయి" అని భగవాన్ విశదపరచినారు.

(సశేషం)

చిన్నకథ

భగవంతుడు భావప్రియుడు

శ్రీశైల దివ్యక్షేత్రానికి సమీపంలో ఒక గ్రామం ఉండేది. ఆ గ్రామంలో బలరాము అనే తొమ్మిది సంవత్సరముల వయసుగల బాలుడు ఎలిమెంటరీ స్కూలులో చదువుకుంటున్నాడు. ఒకనాడు అతని స్నేహితులందరూ "రేపు శివరాత్రి. మా అక్క, బావ శివుని దర్శించటానికి శ్రీశైలం వస్తారు, మా యింటికి వస్తారు" అని ఉత్సాహంగా, ఉల్లాసంగా చెప్పుకోవటం విన్నాడు.

బలరాము తన యింటికి వచ్చి తల్లితో, "అమ్మా! ఇంతవరకు ఎప్పుడూ మా అక్క, బావ యింటికి రాలేదు.
5 ఎప్పుడు వస్తారు? మా స్నేహితులందరికీ అక్క, బావ వస్తారట" అని గోలచేసి ఏడ్చాడు. తల్లి ఆ అబ్బాయిని శాంతపరచేందుకు, "నీకుకూడా అక్కా బావ ఉన్నారు ఆ కొండపైన గుడిలో. మీ అక్క పేరు భ్రమరాంబ, బావ పేరు మల్లికార్జునస్వామి" అని చెప్పింది.

వెంటనే బలరాము, "అయితే సరే! నేను రేపు వెళ్ళి మా అక్కా బావలను మన యింటికి రమ్మని పిలుస్తాను" అని మొండితనం చేశాడు.

ఇక చేసేదిలేక తల్లి తమ ప్రక్క యింటివారు శివరాత్రికి శ్రీశైల దేవాలయానికి బయలుదేరుతుంటే బలరామును వారితోపాటు పంపాలనుకున్నది.

బలరాము, "అక్కకు, బావకు ఏమైనా యివ్వాలి కదా అమ్మా!" అన్నాడు. "చిన్నవాళ్ళు పెద్దవాళ్ళకి యివ్వటం మర్యాద కాదు. నీకు ఏం కావాలో వాళ్ళే యిస్తారులే" అని సమాధానం చెప్పింది, తల్లి.

ప్రక్క యింటివారికి బలరామును అప్పజెప్పి, వారికి కొంత ధనాన్ని యిచ్చి బలరాము అడిగినవి కొనిపెట్టమని కోరింది.

శ్రీశైలానికి చేరేవరకు బలరాము అక్కా బావల గురించే ఆలోచించాడు.

అక్కడి దేవాలయానికి వెళ్ళిన తరువాత ప్రక్కయింటివాళ్ళు, “ఇదిగో బలరామ్! మీ అక్క భ్రమరాంబ, మీ బావ మల్లికార్జునుడు” అని అతని తల్లి చెప్పమన్నట్లు చెప్పారు.

“అక్కా! బావా! మీరు రాకపోతే ఒక్క క్షణం కూడా బ్రతుకను. ఇక్కడినుండి దూకి ప్రాణాలు వదుల్తాను” అని కేకలుపెట్టాడు. తక్షణమే, “ఓ మరిదీ! రామన్నా ఆగు!”, “తమ్ముడూ! నేను వచ్చాను” అనే మాటలు విన్నాడు.

నిశ్చల, నిస్వార్థప్రేమతో, ప్రగాఢమైన విశ్వాసముతో బలరాము భ్రమరాంబ విగ్రహం చేయిపట్టుకొని, “అక్కా! అమ్మ చెప్పింది, నీవు యిప్పుడు యింటికి రావాలి” అన్నాడు. అట్లే మల్లికార్జునస్వామి దగ్గరకు వెళ్ళి, “బావా! బావా! నీవు యింటికి రావాలి” అంటూ ఏడ్చాడు.

పూజారులు, “వీడెవడో పిచ్చివాడు” అంటూ బలరామును బయటకు నెట్టారు.

బలరాము ఆవేదన అధికమైంది. ఆ కొండలలో కొంత దూరం పరుగెత్తి ఒక పెద్ద కొండరాయి నెక్కాడు.

భ్రమరాంబా మల్లికార్జునులు బలరామును చేతులలోనికి తీసుకున్నారు. “మా యింటికి రావాలి” అని వారిని కోరాడు. ఆవిధంగానే బలరాము యింటికి వెళ్ళారు. తల్లీ, కొడుకులను తమలో లీనం చేసుకున్నారు.

బాల బలరాము పరిశుద్ధమైన మనస్సుతో, పవిత్రమైన విశ్వాసంతో భగవంతుని చేరగలిగాడు. పసిపిల్లల హృదయాలలో యిట్టి విశ్వాసాన్ని, పవిత్రమైన భావాలను పెద్దలు, గురువులు పెంపొందించాలి.

- బాబా

చిత్రరచన: బి.వి. సత్యమూర్తి



క్రీడా సాంస్కృతికోత్సవాలు

శ్రీ సత్యసాయి విద్యాలయాల వార్షిక క్రీడా సాంస్కృతికోత్సవాలు 2013 జనవరి 11వ తేదీన శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగాయి. ఆరోజు ఉదయం భగవాన్ బాబావారి వాహనం గం 8 లకు క్రీడా ప్రాంగణంలో ప్రవేశించడం భగవాన్ బాబావారి ఆగమనానికి సంకేతముగా భావించి బాణసంచాను కాల్చారు. విద్యార్థినీ విద్యార్థులు మోటారు సైకిళ్లపై ఎస్కార్ట్‌గా రాగా, నేపథ్యములో సంగీతము వినిపిస్తూ ఉండగా, మరికొందరు విద్యార్థులు వివిధ వర్ణముల పతాకాలను ధరించి భగవాన్ బాబావారికి స్వాగతం పలికారు. అనంతరం, వేదికవద్ద శ్రీ సత్యసాయి విద్యాలయాల అధికారులు, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ వ్యవస్థాపక ఛాన్సలర్ అయిన స్వామికి ప్రణామములు అర్పించారు.

శ్రీ సత్యసాయి ప్రాథమిక విద్యాలయ బాలలు, శ్రీమతి ఈశ్వరమ్మ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు పుష్పగుచ్ఛాలను స్వామికి అర్పించారు. తదుపరి వివిధ వర్ణముల దుస్తులను ధరించిన విద్యార్థినీ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్ వాదనకు అనుగుణముగా కవాతును నిర్వహించి స్వామికి వందన సమర్పణ చేశారు. క్రీడాస్ఫూర్తితో ఆటలలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. క్రీడాజ్యోతిని స్టేడియంలో తిప్పారు. క్రీడోత్సవాల చిహ్నం చిరుతపులి హనుమ గిరిపై ఉన్న ప్రధాన క్రీడా జ్యోతిని వెలిగించింది.

ఆనాటి క్రీడోత్సవాలలో ముందుగా బృందావనం క్యాంపస్ విద్యార్థులు డ్రమ్స్ వాదనను వినిపించారు. మానవుని ఆధ్యాత్మిక ప్రయాణములో వెలుగు నీడలకు ప్రతీకగా తెలుపు, నలుపు రంగుల దుస్తులను ధరించి వివిధ ఆకృతులను ఏర్పరిచారు. తదుపరి మోటార్ సైకిళ్ళపై వివిధ విన్యాసాలను, యుద్ధ విద్యలను ప్రదర్శించారు.

ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు భూగోళ మంతా భగవాన్ బాబావారి దివ్య హస్తాల సంరక్షణలోనే ఉన్నది అన్న వాస్తవానికి రూపునిచ్చి క్రీడా ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ భూగోళంపైన ప్రపంచశాంతికి సంకేతంగా శ్వేత కపోతంయొక్క రూపు ఉన్నది. ఈ భారీ నిర్మాణాన్ని చక్రాలపై శాంతి వేదికవద్దకు తీసుకు వచ్చారు. అనంతరం, రిమోట్‌తో పనిచేసే హేంగ్ గ్లైడర్స్ ఆకాశంలోకి దూసుకువెళ్ళి అనేక విన్యాసాలు చేశాయి. తదుపరి విద్యార్థులు శివతాండవాన్ని, భాంగ్రానృత్యాన్ని, తమిళనాట ప్రాచుర్యంలో ఉన్న అశ్వనృత్యాన్ని ప్రదర్శించారు. ఎంతో ఎత్తున తాడుపై వారు చేసిన విన్యాసాలు, యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నాటి సాయంకాలం గం 4.30 లకు మరలా క్రీడా సాంస్కృతికోత్సవాలు భగవాన్ బాబావారిని లాంఛనంగా ఆహ్వానించడంతో ప్రారంభమయ్యాయి. శ్రీమతి ఈశ్వరమ్మ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు, “జీవితం ఒక ఆట, ఆడు”, “జీవితం ఒక సవాలు, ఎదుర్కో”, “జీవితమంటే ప్రేమ, ఆస్వాదించు” అనే ఇతివృత్తాల ఆధారంగా నర్తించారు, విన్యాసాలు చేశారు. రగ్బీని ఆడారు. యుద్ధవిద్యలను ప్రదర్శించారు. శ్రీ సత్యసాయి ప్రాథమిక పాఠశాల బాలురు, “వందే శివం శంకరం సత్యసాయీశ్వరం...” పాటకు అనుగుణముగా భరత నాట్యాన్ని చేశారు. బాలికలు సూర్యకాంత పుష్ప నృత్యాన్ని మరియూ యోగాసనాలను ప్రదర్శించారు.

హైయర్ సెకెండరీ విద్యార్థినులు చేతి రుమాలును అమిత వేగముగా త్రిప్పుతూ నర్తించారు.

ముద్దేనహళ్ళి క్యాంపస్ విద్యార్థులు “సంభవామి యుగే యుగే” నృత్యాన్ని ప్రదర్శించారు. మత్స్యావతారమునుండి శ్రీ సత్యసాయి అవతారమువరకూ సంభవించిన కొన్ని దివ్య ఘట్టాలను ప్రేక్షకుల ముందుంచారు.

వైట్‌ఫీల్డుయందలి శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు సింహ – డ్రాగాన్‌ల నృత్యాన్ని ప్రదర్శించారు.

సూర్యాస్తమయముతో విద్యుత్ దీపాలు రంగు రంగుల కాంతి పుంజాలను క్రీడా ప్రాంగణమంతా వెదజల్లాయి. అనంతపురం క్యాంపస్ విద్యార్థినులు "శ్రేష్ఠతను సాధించుటకు" అన్న అర్థం వచ్చే ఇతివృత్తంపై ప్రదర్శన ఇచ్చారు. ముందుగా వర్తులాలతో లయబద్ధంగా అడుగులు వేశారు. వివిధ ఆసనాలను ప్రదర్శించారు. త్రికోణాకృతిలో ఉన్న నిర్మాణముపై విన్యాసాలు చేశారు. 30 అడుగుల ఎత్తులో ఉన్న తాడుపై యోగాసనాలు వేశారు. చివరగా, కాంతి పుంజాలు ఇంగ్లీషులో 'సాయి' అన్న అక్షరాలుగా ఏర్పడడముతో క్రీడోత్సవాలు ముగిశాయి.

బాలవికాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జాతీయ స్థాయిలో బాలవికాస్ సమ్మేళనాన్ని జనవరి 12, 13 తేదీలలో ప్రశాంతి నిలయంలో "బాలవికాస్ – శ్రేష్ఠతకు మార్గాలు" అన్న ఇతివృత్తంపై నిర్వహించారు. జనవరి 12వ తేదీన ఉదయం వేద ప్రవచనం అనంతరం ఐదుగురు వక్తలు ఉపన్యసించారు. సిక్కిం రాష్ట్రం నుండి వచ్చిన శ్రీమతి మోనిక శ్రేష్ఠత భౌతిక దృక్పథం పరిధిలో ఉండదన్నారు. అశాశ్వతమైనదేదీ శ్రేష్ఠత కాలేదన్నారు. బాలవికాస్ ప్రాపంచిక దృక్పథానికి ఆవల మన యథార్థమైన వ్యక్తిత్వాన్ని మనం గుర్తించేటట్లు చేస్తుందని చెప్పారు.

శ్రీ సత్యసాయి సంస్థల దేశీయ అధ్యక్షులు శ్రీ వి. శ్రీనివాసన్ భగవాన్ వెలిగించిన ఈ బాలవికాస్ అనే జ్యోతి నిరంతరం మానవాళికి వెలుగుబాట చూపుతూనే ఉంటుందన్నారు. బాలవికాస్ ఉద్యమంపట్ల, వారు చదివిన కళాశాలపట్ల విద్యార్థినీ విద్యార్థులకు బాధ్యత ఉన్నదన్నారు.

లక్నో బాలవికాస్ జోనల్ కోఆర్డినేటర్ అయిన శ్రీ భవేశ్ చంద్ర బాలవికాస్ వలన తనకు విలువలు పెంపొందించుకొనే సదవకాశం లభించిందని కృతజ్ఞతలు తెల్పుకున్నారు. ప్రపంచములోని ప్రతి బాలుడూ, ప్రతి బాలికా ఈ బాలవికాస్ ఉద్యమంవలన లబ్ధి పొందాలని ప్రార్థించారు.

ఒడిషా నుంచి వచ్చిన శ్రీమతి ప్రంచి భగవంతునితో జీవించడమే విద్య అన్నారు. ఐబిఎమ్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న శ్రీ సంతోష్ బాలవికాస్ విద్యార్థిగా తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. వ్యక్తిత్వ వికాసానికి బాలవికాస్ ఎంతగానో దోహదం చేసిందని చెప్పారు.

జనవరి 13వ తేదీన ఉదయం తమిళనాడు బాలల వేద ప్రవచనానంతరం శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, పుట్టపర్తి డాక్టర్ రాజన్ ఆనంద్ తనలో మంచిని పెంపొందించడానికి బాలవికాస్ తోడ్పడిందన్నారు.

అస్సాంనుండి వచ్చిన శ్రీమతి అనుష్క పాథక్ మనమెవరమో, మన నిజతత్త్వమేమిటో మనము తెలుసుకోవడానికి బాలవికాస్ సహాయపడుతుందన్నారు. ఆడంబరముగా చేసే పూజకన్నా నిజాయతీతో చేసే కించిత్ సేవ మిన్న అన్నారు.

హర్యానానుండి వచ్చిన శ్రీ ప్రదీప్ దుగ్గల్ బాలవికాస్ విద్యార్థిగా తాను గడిపిన సమయం తనకు ఈ ప్రపంచంలో ఏవిధంగా జీవించాలో, తోటివారిని ఏవిధముగా ప్రేమించాలో తెలియజేసి, అనంతమైన ఆధ్యాత్మిక సంపదను తనకు ప్రదానం చేసిందన్నారు.

కెమికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ అయిన శ్రీ రమేశ్ శ్రీనివాసన్ తాను గ్రూపు 3 విద్యార్థిగా ఉన్నప్పుడు మూడు సంవత్సరాలపాటు ఆ గ్రూపులో తాను తప్ప ఇంకెవరూ విద్యార్థులు లేరని, అయితే బాలవికాస్ గురువు ముంబై నగరంలో రెండు బస్సులు మారి వచ్చి తనకు బాలవికాస్ తరగతులు నిర్వహించేవారని, ఆ బాలవికాస్ గురువు యొక్క దీక్షను, త్యాగాన్ని కొనియాడారు. ఆ త్యాగం తన జీవితములో అభిలషణీయమైన మార్పును తీసుకు వచ్చిందని చెప్పారు.

ఈ ప్రసంగాల అనంతరం వివిధ వ్యాసాల సంపుటిని బాలవికాస్ జాతీయ కోఆర్డినేటర్ శ్రీమతి సరళాషా, శ్రీమతి విద్యాశ్రీనివాసన్ స్వామికి సమర్పించారు. తదుపరి బాలవికాస్ గురువులను సత్కరించారు. బాలవికాస్ ఉద్యమ వ్యాప్తికి ఇతోధికంగా కృషి చేస్తున్న ప్రతిభావంతులను, ప్రశాంతి నిలయంలోనూ, బృందావనంలోనూ పనిచేస్తూ సాయిసంస్థలకు అంకితమైన బాలవికాస్ పూర్వ విద్యార్థులను సత్కరించారు.

మహారాష్ట్ర బాలవికాస్ సభ్యులు హిందీలో, కొంకణిలో, ఇంగ్లీష్‌లో భక్తిగీతాలను ఆలపించారు.

శ్రీకృష్ణ చైతన్య: జనవరి 12వ తేదీ సాయం సమయంలో బృందావనం క్యాంపస్ విద్యార్థులు శ్రీకృష్ణ చైతన్య జీవితంలో జరిగిన మధుర ఘట్టాలను ఆవిష్కరించారు. నిమాయికి అతని గురువు ఈశ్వరపురి గోపాల మంత్రోపదేశం చేసి, శ్రీకృష్ణ చైతన్య నామమిడి, నామసంకీర్తనద్వారా భగవన్నామాన్ని వ్యాప్తి చేయమని బోధిస్తాడు. రాధయొక్క మధుర భక్తిని కృష్ణ చైతన్యకు వివరిస్తాడు. నాటినుండి శ్రీకృష్ణ చైతన్య మధుర భక్తి భావనలో తాదాత్మ్యం చెందుతాడు.

అనంత ప్రేమ: అనంతపురం క్యాంపస్ విద్యార్థినులు జనవరి 13వ తేదీన సాయంవేళలో ఒక సంగీత విభావరిని నిర్వహించారు. భగవద్గీతలో ప్రముఖముగా చెప్పిన "విలువలు, శరణాగతి, అంకితభావం" ఈ విభావరిలో ముఖ్యాంశాలు. వాయిద్య, గాత్ర సంగీతాల మేళవింపుతో ఈ విభావరి సభాసదులను ఆకట్టుకున్నది.

మకర సంక్రాంతి - క్రీడోత్సవాల ముగింపు

జనవరి 14వ తేదీన సంక్రాంతి పర్వదినాన ఉదయం శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ప్రశాంతి నిలయం క్యాంపస్ బ్రాస్ బ్యాండు సభ్యులు, పతాకధారులయిన విద్యార్థులు, వేద ప్రవచనం చేస్తూ మరికొందరు విద్యార్థులు యజుర్ మందిరంనుండి సంప్రదాయానుసారముగా కుల్వంత్ సభామండపంవద్దకు భగవాన్ బాబావారిని ఆహ్వానించారు.

బృందావనం క్యాంపస్ డైరెక్టర్ శ్రీ సంజయ్ సహానీ తమ స్వాగతోపన్యాసములో భగవాన్ బాబావారే స్వయంగా జనవరి 11, జనవరి 14 తేదీలను క్రీడోత్సవాలకు, బహుమతి ప్రదానానికి నిర్ణయించారని చెప్పారు.

ప్రశాంతి నిలయం క్యాంపస్ వార్డెన్ డా॥ పల్లవ్ కుమార్ బారువా స్వామి దేహాన్ని చాలించిన అనంతరం 2012లో, 2013లో క్రీడోత్సవాలు జరిగాయని, అయితే, స్వామి మన మధ్యనే ఉన్నారనే భావాన్ని పరిపరివిధాలుగా స్వామి మనకు తెలియజేస్తూనే ఉన్నారని చెప్పారు. తదుపరి నాలుగు క్యాంపస్‌లకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ప్రసంగించారు.

అనంతపురం క్యాంపస్ విద్యార్థిని ఐశ్వర్య నీలేశ్వర్ ప్రశాంతి నిలయంలో క్రీడోత్సవాలు ఆత్మవిశ్వాసాన్ని, ఓర్పును, దీక్షను పెంపొందిస్తాయని చెప్పారు.

శ్రీ సత్యసాయి హైయర్ సెకెండరీ స్కూలు విద్యార్థి పి. సాయి ఐకమత్యముతో, దీక్షతో కృషి చేస్తే విజయం తథ్యమని ఈ క్రీడోత్సవాలద్వారా గ్రహించానని చెప్పారు.

బృందావనం క్యాంపస్ విద్యార్థి టి.ఇ. శశిధర్ క్రీడా సాంస్కృతికోత్సవాలు విద్యార్థులు వివిధ రంగాలలో పరిణతి సాధించడానికి తోడ్పడుతాయన్నారు.

ప్రశాంతి నిలయం విద్యార్థి శ్రీహరి ప్రతి విద్యార్థీ స్వామికొరకే క్రీడోత్సవాలలో పాల్గొంటాడని, స్వామి చిరునవ్వే అతిపెద్ద బహుమతి అన్నారు.

తదుపరి వైస్ ఛాన్సలర్ ట్రోఫీలను అందజేశారు.

భగవాన్ బాబావారి ప్రసంగాన్ని అందరూ విన్నారు. స్వామి తమ ప్రసంగంలో సంక్రాంతి పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, యువత సచ్ఛీలాన్ని పెంపొందించుకోవాలని పిలుపు నిచ్చారు. యూనివర్సిటీల డిగ్రీలు ముఖ్యం కాదు, "అమృతస్య పుత్రాః" అన్న పట్టాకోసం ప్రయత్నించాలి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమనే యథార్థమైన విద్యను భారతీయ సంస్కృతి ప్రబోధిస్తున్నదని స్వామి చెప్పారు.

శంకర దిగ్విజయం: సంక్రాంతి పర్వదినాన సాయం సమయంలో ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు 'శంకర దిగ్విజయం' నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను 25 సంవత్సరాల క్రితం స్వామి దివ్యపర్యవేక్షణలో సాయి విద్యార్థులు ముంబైలోనూ, బెంగళూరులోనూ ప్రదర్శించారు.

హైయర్ సెకెండరీ స్కూలు నాటిక: జనవరి 15వ తేదీన సాయంకాలం శ్రీ సత్యసాయి హైయర్ సెకెండరీ స్కూలు విద్యార్థులు **"నా జీవితం మీ దివ్య చరణాల చెంత"** అన్న ఇతివృత్తంపై ఒక నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలో సమకాలీన సామాజిక జీవితంలోని అంశాలే కాక, రామాయణ కాలంనాటి అంశాలు, మహాభారత కాలంనాటి అంశాలు ఉన్నాయి. పాటలతో, నృత్యాలతో ఈ నాటిక శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీ సత్యసాయి అవతారాల విశేషాలతో వినూత్నంగా కొనసాగింది.

శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైట్‌ఫీల్డు (బెంగళూరు) వార్షికోత్సవం

12 సంవత్సరాల క్రితం 2001 జనవరి 19న నాటి భారత ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి సమక్షంలో భగవాన్ ఈ హాస్పిటల్‌ను మానవాళి సేవకు అంకితం చేశారు. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం జనవరి 20వ తేదీన హాస్పిటల్ ఉద్యోగులు సాయికుల్వంత్ హాలులో భజన పాటలు పాడారు. వీడియో డాక్యుమెంటరీని ప్రదర్శించారు. స్వామి ప్రసంగాన్ని విన్నారు. శ్రీమతి ఈశ్వరమ్మ బంగారు పతకాలను హాస్పిటల్ డైరెక్టర్ డా॥ స్వర్ణ భరద్వాజ్ ప్రతిభావంతులైన దీపిక మరియూ అర్చన బాలాజీలకు బహూకరించారు.

ఈ హాస్పిటల్‌లో పెథాలజిస్టుగా పనిచేస్తున్న డా॥ నందిత ఘోషల్ తాను 2002లో ఇక్కడ ఉద్యోగిగా చేరే సమయంలో స్వామి దివ్యత్వముగురించి ఏమాత్రము అవగాహన లేదనీ, అనేక సందేహాలు ఉండేవనీ, అయితే, ఈ దశాబ్ద కాలములో తన ఆధ్యాత్మిక ప్రయాణములో ఎన్నో విషయాలు తెలుసుకున్నానని, స్వామి సాక్షాత్తు భగవంతుడని గ్రహించానని చెప్పారు.

డా॥ శ్రీకాంత్ సోల స్వామి తరచూ మూడు ప్రశ్నలు వేసేవారు అన్నారు. అవి – రోగులు ఎట్లా ఉన్నారు? మీరు ఎట్లా ఉన్నారు? మీకేమైనా కావాలా? ఈ మూడు ప్రశ్నలకు ఈ హాస్పిటల్ అభిలషణీయమైన సమాధానాలు ఇవ్వగలిగే స్థితిలో ఉన్నదని చెప్పారు.

తదుపరి, హాస్పిటల్ సిబ్బంది స్వామి ప్రబోధముల ననుసరించి రోగులతో హృదయపూర్వకమైన, ప్రేమాస్పదమైన సంబంధాన్ని కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కొంతసేపు భజన గీతాలను ఆలపించారు.

అనంతపురం జిల్లా త్రాగునీటి పథకం

1995 నవంబరులో అనంతపురం జిల్లాలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చేపట్టిన త్రాగు నీటి పథకాన్ని ఇప్పుడు 80 కోట్ల రూపాయల వ్యయంతో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్టణం మండలాల్లోని 2.5 లక్షలమందికి ప్రయోజనం చేకూరేవిధంగా విస్తృతపరుస్తున్నారు. జనవరి 24వ తేదీన కొత్తచెరువులో భూమిపూజ జరిగింది. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు శ్రీ ఆర్.జె. రత్నాకర్, సెక్రెటరీ శ్రీ ప్రసాదరావు, జిల్లా కలెక్టరు శ్రీ వి. దుర్గాదాసు, ఎల్ అండ్ టి మాజీ ఛైర్మన్ శ్రీ రామకృష్ణ, ప్రాజెక్టు ఛీఫ్ ఇంజనీరు శ్రీ కొండల రావు, పుట్టపర్తి ఎమ్ఎల్ఎ శ్రీ పి. రఘునాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.

సాయి నృత్య సంగమం: జనవరి 25వ తేదీన సాయం సమయంలో ప్రఖ్యాత కూచిపూడి నాట్యకళాకారులు కలైమామణి మాధవపెద్ది మూర్తిగారి ఆధ్వర్యములో 20మందికి పైగా సాయి విద్యార్థులు నర్తించారు.

గణతంత్ర దినోత్సవం

జనవరి 26వ తేదీన ఢిల్లీ మరియూ నేషనల్ క్యాపిటల్ రీజియన్ సాయి భక్తులు వారి పర్తియాత్రలో భాగంగా వివిధ భాషలలో సంకీర్తన చేశారు. దేశభక్తి గీతాలను ఆలపించారు.

ముందుగా ఢిల్లీ మరియూ ఎన్‌సిఆర్ సాయి సంస్థల అధ్యక్షులు శ్రీ జతీందర్ చీమా వారు చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సెక్రెటరీ శ్రీ ప్రసాదరావు 64 వసంతాల క్రితం భారతదేశం గణతంత్ర దేశంగా అవతరించిందని, భారతీయులందరూ నేడు జాతికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గణతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడు చేసిన అధీకృత ప్రకటనలోని చట్టపరమైన అంశాలను వివరించారు.

సత్యగీత ఇక లేదు

భగవాన్ బాబావారి పెంపుడు ఏనుగు 'సత్యగీత' 2013 జనవరి 22 తెల్లవారు ఝామున పరమపదించింది. సాయిగీత తదనంతరం ఆ స్థానాన్ని భర్తీ చేసిన సత్యగీత ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్యముతో బాధపడుతున్నది. స్వామి సన్నిధికి 2007వ సంవత్సరంలో వచ్చిన సత్యగీత ప్రశాంతి నిలయంలో జరిగే ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా ఉండేది.

- దివి చతుర్వేది
(ప్రశాంతి నిలయం)

Sri Sathya Sai Institute of Higher Medical Sciences

EPIP Area, Whitefield, Bengaluru – 560066
Tel.: 080-28511500 Extn. 415, Fax: 080-28411502
Email: registrarblr@sssihms.org.in

Sri Sathya Sai Institute of Higher Medical Sciences, Whitefield, Bengaluru is offering 4 years course leading to Bachelors degree in Nursing (for Girl Students only) and 3 ½ year courses leading to Bachelors degree in Anaesthesia Technology, Cardiac Care Technology, Imaging Technology, Medical Laboratory Technology and Perfusion Technology (for Girl Students only). Applications are invited from candidates who fulfil the eligibility criteria as given below.

Age: Candidates should have completed minimum 17 years and maximum 25 years of age on or before 31st of December in the year of application for admission.

Qualification: 10+2, PUC or any other qualifying examination conducted by Boards / Councils / Intermediate Education established by State Governments / Central Government and recognised as equivalent to two year Pre-University examination by the Rajiv Gandhi University of Health Sciences / Association of Indian Universities (AIU).

Subjects in 10+2 / PUC: Candidates should have passed subjects of Physics, Chemistry, Biology and English (PCBE) individually and must have obtained a minimum of not less than 45% marks put together in all these subjects. For B.Sc. Imaging Technology, the candidate should have passed Mathematics, Physics, Chemistry and English with an aggregate of 45%. Candidates desirous of applying can download the application form from the website and send the same by post. Incomplete applications, applications in a different format and applications not meeting the eligibility criteria will be rejected. The applications will be entertained from 1st March 2013 to 30th April 2013. The date of entrance exam will be intimated separately.

For further details log on to www.wfd.sssihms.org.in

– Director

Sri Sathya Sai Gurukulam English Medium School

Alcot Gardens, Rajahmundry – 533101, East Godavari Dist., A.P.,
Ph.: 0883 2430989 (Affiliated to C.I.S.C.E., New Delhi)

Admission to Class I (boys only) of Sri Sathya Sai Gurukulam English Medium School, Rajahmundry, will take place in June, 2013. It is an English Medium, wholly residential school following I.C.S.E. syllabus.

Prospectus and Admission Forms may be obtained from the school from 10-02-2013 by paying ₹ 50/- either by cash or through Demand Draft drawn from any Nationalised Bank in favour of Correspondent, Sri Sathya Sai Gurukulam English Medium School, payable at Rajahmundry. For obtaining the application set by post, please send a Demand Draft with a self-addressed cover (size 15 cm x 24 cm) and ₹ 15 stamps.

Last date for issuing the forms is 30th March 2013 and the last date for receiving the filled in forms at this office is on or before 10th April 2013.

Only students coming from English medium classes should apply.

Age limit for 1st std. is between 5 years and 6 years as on 31st August 2013.

– Correspondent

Sri Sathya Sai General Hospital

Prasanthi Nilayam – 515134

Email: hrmgh@sssihms.org.in, Phone 08555-287256, Fax: 08555-289409

Applications are invited for the following posts:

Consultant / Senior Resident in the Department of OBGY

Qualification: MBBS + MD / DGO preferably with minimum 3 / 6 years of experience in the Department of OBGY.

Scale of Pay: Consultant: Basic pay ₹ 47,390 + allowances. Senior Resident (with PG Degree) Basic pay ₹ 25,350 + allowances. Senior Resident (with Diploma) Basic pay ₹ 21,000 + allowances.

Consultant in the Department of General Surgery

Qualification: MS / DNB in General Surgery, preferably with minimum eight years of experience in the Department of General Surgery.

Scale of Pay: As mentioned above.

Apply to the Medical Superintendent, Sri Sathya Sai General Hospital, Prasanthi Nilayam, with full bio-data and a photograph immediately.

– Medical Superintendent

Sri Sathya Sai General Hospital

Whitefield main road, Whitefield, Bengaluru – 560066

Email: hr.ghwfd@sssihms.org.in, Phone 080-28452330

Applications are invited for the following posts:

Senior Resident – General Medicine No. of vacancies: 1

Qualification: MBBS + MD / DNB

Minimum Experience: 1 year and above in a recognised institution.

Basic pay: ₹ 25,350 + allowances

Senior Resident – General Surgery

No. of vacancies: 1

Qualification: MBBS + MS / DNB

Minimum Experience: 1 year and above in a recognised institution

Basic pay: ₹ 25,350 + allowances

Junior Resident - Paediatrics

No of vacancies: 1

Qualification: MBBS

Minimum Experience: 1 year and above in a recognised institution

Basic pay: ₹ 15,000 for the first year

Interested candidates may apply to the Human Resource Officer with full bio-data and photograph immediately by courier or post to the address mentioned above.

– Medical Superintendent



శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ వార్షిక సాంస్కృతిక క్రీడోత్సవ దృశ్యమాలిక

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/001/2012-2014
Licenced to post without prepayment No. HDP/001/2012-2014

"అనంత ప్రేమ"

"శ్రీకృష్ణ చైతన్య"

"శంకర దిగ్విజయం"

మానవ సేవయే దైవ పూజ

"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి" అని భగవద్గీతలో చెప్పినట్లుగా అందరిలోనూ శివుడున్నాడు. శివుడు లేనివాడు శవమైపోతాడు కదా! కాబట్టి, దేవుడు ఏ అమర్‌నాథ్‌లోనో, కాశీలోనో, భద్రాచలంలోనో మాత్రమే ఉన్నాడనే భావమును పూర్తిగా తీసివేసి, అతడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి, సర్వభూతాంతరాత్మ అని విశ్వసించి అందరినీ దైవ భావముతోనే ఆదరించండి. జడమైన విగ్రహములను పూజించేదానికన్న, సజీవ దేవతా విగ్రహులైన మానవులను సేవించటముచేత నిత్యసత్యమైన ఆత్మానుభూతి లభించి అమితానందము చేకూరుతుంది. అందరిలోనూ మీ ఆరాధ్య దైవమున్నాడనే విశ్వాసమును అభివృద్ధిపరచుకోవలెను. "నాలోనూ అంతర్యామిగా ఆ దైవమే ఉన్నాడు. నా సేవాసాధన ఫలములన్నీ అతనికే అర్పితము. అదే అతని పూజ" అను భావము దృఢము కావలెను. అప్పుడు సదా జాగరణగా, సదా ఉపవాసముగా జీవితము జరుగును. కష్టము, నష్టము, విచారము, విషాదము అన్నీ మరుగైపోవును.

\- బాబా

వార్షిక చందా: రూ॥ 60.00 (భారతదేశంలో)
రూ॥ 550 లేక $13 లేక £9 (విదేశాలకు)
చందా ఒకటి, లేక రెండు, లేక మూడు
సంవత్సరాలకు స్వీకరింపబడును

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు పబ్లికేషన్స్ విభాగం

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Anantapur district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : B.V. Ramana Rao